RNI No: TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:50 | జనవరి 28, 2026 | వెల: రూ.3-00



దివ్యాంగుల సంక్షేమమే
**ప్రజా ప్రభుత్వ లక్ష్యం**
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2లో

# ఫిబ్రవరి 11న పురపోరు!

**మున్సిపల్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల**




**116 మున్సిపాలిటీలు.. 7 కార్పొరేషన్లకు ఎలక్షన్స్**

- ఒకే విడతలో పోలింగ్.. 13న ఫలితాలు
- నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని
- ఇక ప్రత్యక్షంగా రంగంలోకి దిగనున్న పార్టీలు
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు తలనొప్పిగా 'రెబెల్స్'
- 'ఆఫర్ల'తో బుజ్జగింపుల పర్వం షురూ

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక ఘట్టానికి తెరలేచింది. రాష్ట్రంలో ఎప్పడెప్పడా అని ఎదురుచూస్తున్న మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మంగళవారం విడుదల చేశారు. నోటిఫికేషన్ వెలువడిన నిమిషం నుంచే పట్టణ ప్రాంతాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి రాగా.. ఫిబ్రవరి 11న పోలింగ్, 13న ఫలితాల వెల్లడికి ముహూర్తం ఖరారైంది. అధికార కాంగ్రెస్‌కు ఇది ప్రతిష్ఠాత్మక పరీక్షగా మారగా, ఉనికిని చాటుకోవాలని బీఆర్ఎస్, పాగా వేయాలని బీజేపీ వ్యూహాలు రచిస్తున్నాయి. నేటి నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుండటంతో అభ్యర్థుల ఎంపిక, రెబల్స్ బుజ్జగింపులతో ప్రధాన పార్టీల్లో సందడి పతాక స్థాయికి చేరింది. పట్టణ ఓటరు నాడి ఎటుందో తేల్చే ఈ 'మినీ సంగ్రామం' ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది.


2లో



# వన జాతర!

## నేటినుంచి మేడారం మహా జాతర

- లక్షలాదిగా తరలివస్తున్న భక్తులు
- నేడు కన్నెపల్లి నుంచి సారలమ్మ తల్లి గద్దెపైకి రాక
- గోవిందరాజులు, పగిడిద్దరాజులు సైతం..
- రేపు చిలకల గుట్టనుంచి రానున్న సమ్మక్క తల్లి
- మరో రెండు రోజుల పాటు భక్తుల మొక్కులు
- భక్తజన గుడారంగా మారిన మేడారం
- హైటెక్ నిఘాలో ఆదివాసీ జాతర
- అధికారుల పకడ్బందీ ఏర్పాట్లు
- భక్తులను అధిక ధరలతో నిలువు దోపిడీ చేస్తున్న వ్యాపారులు



2లో

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

తెలంగాణ అడవి తల్లి ఒడిలో ఆసియాలోనే అతిపెద్ద గిరిజన కుంభమేళాకు రంగం సిద్ధమైంది. లక్షలాది మంది గిరిజన, గిరిజనేతర భక్తుల ఆరాధ్య దైవాలు, అన్యాయంపై ఎదిరించిన వీరవనితలు సమ్మక్క, సారలమ్మల మహా జాతర నేడు అత్యంత వైభవంగా ప్రారంభం కానుంది. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం గ్రామం ఇప్పుడు భక్తజన సంద్రంగా మారింది. ఎటువంటి ఆహ్వానం లేకుండానే కోట్లాది మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చే ఈ అద్భుత ఘట్టం, అడవి తల్లి సాక్షిగా సాగే ప్రకృతి ఆరాధనకు నిదర్శనం. నేడు కన్నెపల్లి నుంచి సారలమ్మ తల్లి గద్దెకు చేరుకోవడంతో జాతర తొలి ఘట్టం మొదలుకానుంది. ఏఐ టెక్నాలజీ, డ్రోన్ కెమెరాలు, హైటెక్ నిఘా నీడలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. ఒకవైపు గద్దెల వద్ద భక్తి పారవశ్యం.. మరోవైపు జంపన్న వాగులో పుణ్య స్నానాలు.. ఇంకోవైపు తల్లుల నామస్మరణతో మేడారం అరణ్యం ఆధ్యాత్మిక లోకాన్ని తలపిస్తోంది. తెలంగాణ ఆత్మ గౌరవ ప్రతీకగా నిలిచే ఈ చారిత్రాత్మక జాతరపై 'వేద న్యూస్' అందిస్తున్న ప్రత్యేక కథనం.

# ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య పరిస్థితి విషమం



**వాహనాల తనిఖీలో కారుతో ఢీకొట్టిన గంజాయి ముఠా**

- కడుపుపై తీవ్ర గాయం.. లివర్, కిడ్నీలు డ్యామేజ్
- ఎడమ కిడ్నీ తొలగింపు.. ఐసీయూలో నిరంతర పర్యవేక్షణ
- ప్రత్యేక బృందాలతో నిందితుల వేట

2లో



గంజాయి ముఠాలకు
# ప్రభుత్వం అంటే భయం లేదు

- గ్రామాల నుంచి పాఠశాలల వరకు విస్తరించిన మత్తు పదార్థాలు
- మహిళలు, కుటుంబాలపై తీవ్ర ప్రభావం
- ఎక్సైజ్, ఫారెస్ట్ సిబ్బందికి ఆయుధాలు ఇవ్వాలి
- జాగృతి అధ్యక్షురాలు కవిత
- నిమ్స్‌లో గాయపడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యకు పరామర్శ

2లో

మున్సిపల్ ఎన్నికలకు
## యంత్రాంగం సిద్ధంగా ఉండాలి

- స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సమీక్ష

2లో



కాంగ్రెస్ ప్రభుత్వానికి
## రోజులు దగ్గర పడ్డాయ్

- రిటైర్డ్ ఉద్యోగులను మోసం చేసిన ఘనత
- పెండింగ్ డీఏలు, పీఆర్సీ అమలులో వైఫల్యం
- ఉద్యోగులు, పెన్షనర్ల ఆగ్రహమే హెచ్చరిక
- బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్ రావు

2లో




## బంగారం భగభగ! చుక్కలు చూపిస్తున్న వెండి

- 24 క్యారెట్ల గోల్డ్ తులం ధర రూ. 1,61,950
- వెండి ఒక్కరోజులోనే రూ. 10 వేలు జంప్
- కిలోకు రూ. 3,75,000గా నమోదు
- షాక్‌లో సామాన్యులు, వ్యాపారులు

2లో

ఫోన్ ట్యాపింగ్ కేసు..
## సిట్ ఎదుట సంతోష్ రావు

- జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలో విచారణ
- సోమవారం నోటీసులు.. మంగళవారం హాజరు
- అడిగే ప్రశ్నలన్నింటికీ సమాధానాలు ఇస్తానన్న సంతోష్ రావు
- ఇప్పటికే హరీశ్ రావు, కేటీఆర్ విచారణ పూర్తి

2లో



వేద న్యూస్



# ఫిబ్రవరి 11న పురపోరు!

## మున్సిపల్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణలో ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న మున్సిపల్ ఎన్నికలకు ఎట్టకేలకు షెడ్యూల్ విడుదలైంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మంగళవారం అధికారికంగా ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. షెడ్యూల్ విడుదలైన క్షణం నుంచే ఎన్నికలు జరిగే అన్ని పట్టణాల్లో ఎన్నికల కోడ్ తక్షణమే అమల్లోకి వచ్చింది.

**ఫిబ్రవరి 11న ఎన్నికలు**

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. జనవరి 28 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. జనవరి 30 వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. ఫిబ్రవరి 11వ తేదీన ఒకే విడతలో పోలింగ్ నిర్వహించనుండగా, ఫిబ్రవరి 13న ఫలితాలను వెల్లడించనున్నారు. రీ పోలింగ్ ఎక్కడైనా అవసరం ఉంటే 12వ తేదీన నిర్వహించనున్నారు. అనంతరం ఫిబ్రవరి 16న 116 మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు, అలాగే 7 కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలు జరగనున్నాయి. షెడ్యూల్ విడుదల చేసిన అనంతరం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికలు పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. పోలీస్ యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి భద్రత ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ**

నేటి నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానున్న నేపథ్యంలో.. రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద తగిన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నామినేషన్ కేంద్రాల వద్ద గుంపులు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని పోలీసు శాఖకు సూచించారు. ఎన్నికల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, ప్రతి దశను నిశితంగా పర్యవేక్షిస్తామని ఎస్ఈసీ స్పష్టం చేశారు.

**పార్టీలకు ఎంతో ప్రతిష్టాత్మకం**

ఇక ఈ మున్సిపల్ ఎన్నికలు ప్రధాన రాజకీయ పార్టీలకు అత్యంత కీలకంగా మారాయి. అధికార కాంగ్రెస్‌కు ఇది తొలి పెద్ద పట్టణ పరీక్ష కాగా, ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు రాజకీయంగా తిరిగి పుంజుకునే అవకాశంగా మారింది. మరోవైపు బీజేపీ కూడా పట్టణాల్లో తన ప్రభావాన్ని పెంచుకునేందుకు ప్రత్యేక వ్యూహాలతో రంగంలోకి దిగుతోంది.

# వన జాతర!



**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

తెలంగాణ అడవి తల్లి ఒడిలో ఆసియాలోనే అతిపెద్ద గిరిజన కుంభమేళాకు రంగం సిద్ధమైంది. దక్షిణ భారత కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతర నేటి నుంచి అత్యంత వైభవంగా ప్రారంభం కానుంది. కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచే ఈ వేడుక కోసం ములుగు జిల్లా తాడ్వాయి అడవులు జనసంద్రంగా మారాయి. తెలంగాణ సంస్కృతికి తలమానికం, ప్రకృతి ఆరాధనకు నిదర్శనం మేడారం జాతర. రెండేళ్లకోసారి వచ్చే ఈ అపురూప ఘట్టం కోసం యావత్ దేశం ఎదురుచూస్తోంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాలు, గ్రామాల నుంచి దార్లన్నీ మేడారం వైపే కదులుతున్నాయి. కేవలం తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు.

**అద్భుత ఘట్టాలకు ముహూర్తం**

నేడు జాతరలో మొదటి ఘట్టం ప్రారంభం కానుంది. కన్నెపల్లి నుంచి సారలమ్మ తల్లి గద్దెకు చేరుకుంటారు. అదే సమయంలో కొండాయి నుంచి గోవిందరాజులు, పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజులు కాలినడకన మేడారం చేరుకుని గద్దెలపై కొలువుదీరనున్నారు. 29వ తేదీ గురువారం జాతరలో అత్యంత కీలకమైన రోజు. చిలుకలగుట్ట నుంచి సమ్మక్క తల్లిని కుంకుమ భరిణె రూపంలో గిరిజన పూజారులు గద్దెకు తీసుకు వస్తారు. ఈ సమయంలో భక్తుల పూనకాలు, జయజయధ్వానాలతో అడవి మొత్తం మార్మోగిపోతుంది. 30, 31వ తేదీ ఈ రెండు రోజులు భక్తులు భారీ సంఖ్యలో గద్దెల వద్దకు చేరుకుని తమ మొక్కులు చెల్లించుకుంటారు. తమ ఎత్తు తూకం బంగారం (బెల్లం) ఆ తల్లులకు సమర్పించుకుంటారు. 31వ తేదీ శనివారం సాయంత్రం వనదేవతలు తిరిగి వన ప్రవేశం చేయడంతో ఈ చారిత్రాత్మక జాతర ముగుస్తుంది.

**పకడ్బందీ ఏర్పాట్లు**

మేడారం జాతరను విజయవంతం చేయడానికి ప్రభుత్వ యంత్రాంగం పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసింది. మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్, ఎస్పీ మేడారంలోనే తిష్టవేసి ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భక్తుల రవాణా కోసం ఆర్టీసీ వేలాది బస్సు సర్వీసులను నడుపుతోంది. మేడారం వైపు వచ్చే ప్రతి దారిలోనూ ట్రాఫిక్ జామ్ కాకుండా వందలాది మంది పోలీసులు రద్దీని క్లియర్ చేస్తున్నారు. సుమారు 30వేల మందికి పైగా పోలీసులు, ప్రత్యేక బలగాలు నిరంతరం గస్తీ కాస్తున్నారు. పారిశుధ్య పనుల కోసం వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. తాగునీటి ఎద్దడి లేకుండా జంపన్నవాగు పరిసరాల్లో స్నానాల ఘాట్ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**భక్తుల జేబులకు చిల్లు!**

ఒకవైపు భక్తి పారవశ్యం కొనసాగుతుంటే, మరోవైపు వ్యాపారులు భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు. సామాన్య భక్తులకు కనీస అవసరాలైన కొబ్బరికాయలు, కోళ్లు, కట్టెలు, నీళ్ల బాటిళ్లు, గ్యాస్ సిలిండర్ల ధరలను వ్యాపారులు రెట్టింపు చేశారు. ఒక్కొక్క కొబ్బరికాయ 80 నుంచి 100 రూపాయలకు విక్రయిస్తుండగా, వంట సామాగ్రి కిరాయిలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అధికారులు తనిఖీలు చేస్తున్నా వ్యాపారుల ఆగడాలు తగ్గడం లేదని భక్తులు వాపోతున్నారు.

**భక్తి, విశ్వాసంతో మార్మోగనున్న మేడారం**

అన్ని ఏర్పాట్ల మధ్య మేడారం మరోసారి భక్తి, విశ్వాసంతో మార్మోగనుంది. సమ్మక్క, సారలమ్మలపై అపారమైన నమ్మకంతో కోట్లాది మంది భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు తరలివస్తున్నారు. ఈ నాలుగు రోజులు మేడారం అడవులు ఒక మహా ఆధ్యాత్మిక ప్రాంగణంగా మారనున్నాయి. భక్తుల భద్రత, సౌకర్యాలే లక్ష్యంగా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటుండగా.. కోట్లాది మంది భక్తులు తల్లుల దర్శనంతో తమ మొక్కులు తీర్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. కోట్లాది మంది ప్రజలు ఎటువంటి ఆహ్వానం లేకుండా, కేవలం విశ్వాసంతో తరలివచ్చే ఈ మేడారం జాతర కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, ఇది తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక.

**టెక్నాలజీతో 'హైటెక్' నిఘా**

ఈసారి ప్రభుత్వం జాతర నిర్వహణలో సాంకేతికతకు పెద్దపీట వేసింది. జాతరలో తొక్కిసలాట జరగకుండా, జనం ఎక్కడ ఎక్కువగా గుమిగూడుతున్నారో కనిపెట్టడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని వాడుతున్నారు. పోలీసు కంట్రోల్ రూమ్ నుంచి ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. జాతరలో పిల్లలు తప్పిపోతే వారిని వెంటనే గుర్తించడానికి ఈసారి కొత్తగా క్యూఆర్ కోడ్‌తో కూడిన ట్యాగ్‌లను పిల్లలకు కడుతున్నారు. దీనివల్ల నిమిషాల్లో వారి ఆచూకీ కనుగొనే అవకాశం ఉంటుంది. మేడారం పరిసర ప్రాంతాల్లోని ప్రతి అంగుళాన్ని వందలాది డ్రోన్ల ద్వారా పర్యవేక్షిస్తున్నారు.

# సిట్ ఎదుట సంతోష్‌రావు హాజరు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

బీఆర్ఎస్ పార్టీ కీలక నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌రావు ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం ఎదుట విచారణకు హాజరయ్యారు. జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలో సిట్ అధికారులు ఆయనను ప్రశ్నిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో విచారణకు హాజరుకావాలని సోమవారం సిట్ సంతోష్‌రావుకు నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసుల మేరకు మంగళవారం ఆయన విచారణకు హాజరయ్యారు. నోటీసులు అందుకున్న అనంతరం సంతోష్‌రావు మీడియాతో మాట్లాడుతూ, సిట్ అధికారులు అడిగే అన్ని ప్రశ్నలకు పూర్తిస్థాయిలో సమాధానాలు ఇస్తానని తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ లను సిట్ అధికారులు విచారించారు.

# ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య పరిస్థితి విషమం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

నిజామాబాద్ జిల్లాలో గంజాయి ముఠాను అడ్డుకునే క్రమంలో కారుతో ఢీకొట్టబడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి వైద్యులు విడుదల చేసిన తాజా ఆరోగ్య బులిటెన్‌లో ఆమెకు తీవ్ర అంతర్గత గాయాలు ఉన్నట్లు తెలిపారు. వైద్యుల వివరాల ప్రకారం, కారు కడుపు పైభాగానికి బలంగా ఢీకొట్టడంతో లివర్, కిడ్నీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పక్కటెముకలు విరిగిపోయాయి. ప్రాణాపాయం దృష్ట్యా ఎడమ కిడ్నీని శస్త్రచికిత్స ద్వారా తొలగించాల్సి వచ్చిందని వైద్యులు వెల్లడించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగానే ఉన్నప్పటికీ చికిత్సకు సహకరిస్తున్నారని తెలిపారు. ఆమెను ఐసీయూలో ఉంచి నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని, రక్తనాళాలు, శ్వాసకోశ వ్యవస్థలపై కూడా ప్రభావం పడినట్లు పేర్కొన్నారు. మరిన్ని పరీక్షలు, ప్రత్యేక చికిత్సలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లాలో వాహనాల తనిఖీలు చేపడుతున్న సమయంలో గంజాయి ముఠా సభ్యులు కారుతో సౌమ్యను ఢీకొట్టారు. తీవ్ర గాయాలపాలైన ఆమెను తొలుత జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి మరింత విషమించడంతో హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. ఈ ఘటనపై ఎక్సైజ్ శాఖ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

# ప్రభుత్వం అంటే భయం లేదు

**జాగృతి అధ్యక్షురాలు కవిత**

నిజామాబాద్‌లో గంజాయి ముఠా దాడిలో తీవ్రంగా గాయపడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను, ఆమె కుటుంబ సభ్యులను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె వైద్యులను చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కవిత మాట్లాడుతూ, ఒక ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను చంపే స్థాయికి గంజాయి ముఠాలు వెళ్లాయంటే ప్రభుత్వంపై వారికి ఏ మాత్రం భయం లేదని స్పష్టంగా అర్థమవుతోందని తీవ్రంగా విమర్శించారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేస్తూ, ప్రస్తుతం గ్రామాల్లో కూడా స్వేచ్ఛగా గంజాయి, మత్తు పదార్థాలు లభిస్తున్న పరిస్థితి ఏర్పడిందని అన్నారు. పాఠశాలల వరకు గంజాయి, డ్రగ్స్ చొరబడటం అత్యంత ప్రమాదకరమని కవిత ఆందోళన వ్యక్తం చేశారు.

# దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: భట్టి

**వేద న్యూస్, మధిర**

మధిర నియోజకవర్గ కేంద్రంలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేసినట్లు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కాలంలోనే దివ్యాంగుల సంక్షేమం కోసం సుమారు వంద కోట్ల రూపాయలను ఖర్చు చేసినట్లు వెల్లడించారు. దివ్యాంగ విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రభుత్వం పూర్తి భరోసా ఇస్తోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఐప్యాడ్లు, ల్యాప్‌టాప్‌లు అందజేస్తూ వారి విద్యాభ్యాసానికి అండగా నిలుస్తున్నామని చెప్పారు. అంగవైకల్యం ఎదుగుదలకు అడ్డంకి కాకూడదని, దివ్యాంగులను సమాజంలో మనతో సమానంగా గౌరవప్రదమైన స్థితిలో నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# నిజాలు బయటపడకుండా కుట్ర!

**వేద న్యూస్, హుస్నాబాద్**




- హుస్నాబాద్ మోడల్ స్కూల్ విచారణపై పలు అనుమానాలు
- నాలుగేళ్లుగా సాగుతున్న డైరీ దొంగతనం విచారణ
- కొందరిని కాపాడేందుకు తూతూ మంత్రంగా..

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మోడల్ స్కూల్‌లో చోటుచేసుకున్న డైరీ దొంగతనం ఘటన వెనుక కుట్రపూరిత చర్యలు ఉన్నాయనే ఆరోపణలు రోజు రోజుకూ తీవ్రతరమవుతున్నాయి. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలపై ప్రశ్నించిన విద్యార్థిని హరిణిని స్కూల్ నుంచి పంపించాలనే ఉద్దేశంతోనే ఈ వ్యవహారం నడిచిందని బాధితుల కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. వారి వాదన ప్రకారం... స్కూల్ ప్రిన్సిపాల్, కంప్యూటర్ ఆపరేటర్, అతని వదిన కలిసి ముందస్తు ప్రణాళికతో డైరీ దొంగతనం చేయించి, ఆ బాధ్యతను విద్యార్థులపై నెట్టే ప్రయత్నం చేశారని తెలిపారు. దీనికి సంబంధించిన ఆధారాలను జిల్లా విద్యాధికారులకు సమర్పించినట్లు విద్యార్థిని హరిణి తండ్రి పేర్కొన్నారు. డైరీ ఎక్కడ ఉందని అడిగినప్పుడు తనకు తెలియదని ముందుగా చెప్పినప్పటికీ, అదే సమయంలో విద్యార్థినికి టీసీ ఇచ్చి పంపించే ప్రయత్నాలు జరిగాయని ఆయన ఆరోపిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం ముందే పథకం ప్రకారమే జరిగిందన్న అనుమానాలను బలపరుస్తోందని బాధితులు పేర్కొంటున్నారు.

**సీసీ టీవీ ఫుటేజ్ డిలీట్?**

ఈ ఘటనకు సంబంధించిన కీలకమైన సీసీ కెమెరాల ఫుటేజ్‌ను ప్రిన్సిపాల్ ఆదేశాల మేరకు కంప్యూటర్ ఆపరేటర్ డిలీట్ చేశారని బాధితులు ఆధారాలతో పేర్కొంటున్నారు. ఫుటేజ్ డిలీట్ ఎవరి ఆదేశంతో జరిగింది? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఈ ఘటన 2022లో జరిగినప్పటికీ, దాదాపు నాలుగు సంవత్సరాలుగా విచారణ పేరుతో కాలయాపన జరుగుతోందని బాధితులు వాపోతున్నారు. విచారణ నివేదిక ఇవ్వాలని సిద్దిపేట జిల్లా విద్యాధికారిని పలుమార్లు కోరినా, విచారణ కొనసాగుతోంది అనే సమాధానం తప్ప ఎటువంటి స్పష్టమైన ఫలితం లేదని వారు వాపోయారు.

**తూతూ మంత్రంగా..**

2026 జనవరి 21న నిర్వహించిన విచారణలో తాము సమర్పించిన ఆధారాలను పూర్తిగా పరిగణలోకి తీసుకోకపోవడం, పిర్యాదు చేసిన వారందరిని విచారించకుండా కొందరినే విచారించడంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది నిజమైన విచారణేనా? లేక కొందరిని కాపాడేందుకే నిర్వహించిన తూతూమంత్రం విచారణనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అలాగే గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రిన్సిపాల్‌ను కాపాడేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయని బాధితులు ఆరోపిస్తున్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ విషయంలో అవకతవకలు జరిగాయని విద్యాశాఖ అధికారులు నివేదిక ఇచ్చినప్పటికీ, సస్పెన్షన్ చేయాల్సిన బదులు ట్రాన్స్‌ఫర్ చేయడం చట్ట విరుద్ధమని వారు పేర్కొంటున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని, తాము సమర్పించిన ఆధారాలను పరిగణలోకి తీసుకుని స్వతంత్ర దర్యాప్తు నిర్వహించాలని బాధితుల కుటుంబం డిమాండ్ చేస్తోంది. చదువుకునే పిల్లలను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతోంది.

# కాంగ్రెస్‌కు రోజులు దగ్గర పడ్డాయ్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**




**రిటైర్డ్ ఉద్యోగులను మోసం చేసిన పార్టీ**

**బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు లెక్కపెట్టబడ్డాయని, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులే కాంగ్రెస్‌ను రాజకీయంగా సమాధి చేస్తారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచెందర్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులను నిర్దాక్షిణ్యంగా మోసం చేస్తోందని ఆరోపిస్తూ ధర్నా చౌక్‌లో నిర్వహించిన మహాధర్నాలో పాల్గొని ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా రాంచెందర్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ప్రజలను మోసం చేసిన చరిత్ర ఉందన్నారు. పేదరిక నిర్మూలన నినాదాల నుంచి నిరుద్యోగ హామీల వరకు, గ్యారంటీల పేరుతో ఇచ్చిన వాగ్దానాల వరకు అన్నీ మాటలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో గొప్ప హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించడమే కాంగ్రెస్ నైజమని ఆరోపించారు. తెలంగాణలో కూడా అదే మోసపూరిత రాజకీయాలు కొనసాగుతున్నాయని అన్నారు. పునరావృత హామీలు ఇచ్చినప్పటికీ రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన ప్రయోజనాలు విడుదల చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన తెలిపారు. వేతన సవరణ కమిషన్ అమలులో తీవ్ర జాప్యం జరుగుతోందని, ప్రభుత్వానికి జీవితాంతం సేవ చేసిన ఉద్యోగులు తమ హక్కుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోనే ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి, ఆర్థిక అవ్యవస్థకు నిదర్శనమని రాంచెందర్ రావు మండిపడ్డారు. ఈ అన్యాయాన్ని ఉద్యోగులు, పెన్షనర్లు సహించరని, రోడ్లపై కనిపిస్తున్న ఆగ్రహమే కాంగ్రెస్ ప్రభుత్వానికి స్పష్టమైన హెచ్చరికగా మారుతుందని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ పతనానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని ఆయన హెచ్చరించారు.

### ధర్నాలో టీఆర్పీఈయూ-445

# పాల్గొనడం లేదు

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశి కుమార్**

**వేద న్యూస్, హనుమకొండ**

తెలంగాణ విద్యుత్ సంస్థలలో కొన్ని యూనియన్లు మరియు అసోసియేషన్లు తలపెట్టిన ధర్నాలో టీఆర్ పీఈయూ–445 భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధం పాల్గొనడం లేదని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశి కుమార్ తెలిపారు. గతంలో భాగస్వామిగా ఉన్న జేఏసీ యొక్క ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకించి రాతపూర్వకంగా ఆ జేఏసీ నాయత్వానికి తెలియచేసి బయటకు రావడం జరిగిందన్నారు. ప్రస్తుతానికి వారు ఏ జేఏసీతో కలవకూడదని నిర్ణయించడం జరిగిందన్నారు. అలాగే భవిష్యత్తులో భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ తో పాటు తమతో కలిసివచ్చే యూనియన్ లతో అసోసియేషన్ లతో కలిసి ఒక జేఏసీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. కావున నేడు బుధవారం వివిధ యూనియన్లు అసోసియేషన్ లు చేపట్టబోవు ధర్నా కార్యక్రమంలో టీఆర్ పీఈయూ– 445 భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ కార్మికులు ఎవరూ పాల్గొన రాదని తెలిపారు.

# బంగారం భగభగ

**చుక్కలు చూపిస్తున్న వెండి ధరలు**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

బంగారం, వెండి ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో కొనసాగుతున్న అనిశ్చిత పరిస్థితుల ప్రభావంతో పసిడి మరోసారి కొత్త గరిష్ఠాన్ని తాకగా, వెండి ఒక్కరోజులోనే ఏకంగా 10 వేల పెరుగుదల నమోదు చేసింది. ప్రపంచవ్యాప్తంగా యుద్ధ వాతావరణం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అమెరికా వాణిజ్య నిర్ణయాలు, వివిధ దేశాలపై విధిస్తున్న సుంకాల కారణంగా పెట్టుబడిదారులు కలవరపడుతున్నారు. భద్రమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు ఇన్వెస్టర్లు మొగ్గుచూపడంతో ధరలు సామాన్యులకు అందని స్థాయికి చేరుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర గణనీయంగా పెరిగింది. వెండి ధర కూడా భారీగా పెరిగి కొత్త రికార్డు స్థాయికి చేరింది. ఈ ప్రభావం దేశీయ మార్కెట్‌పైనా స్పష్టంగా కనిపిస్తోంది. హైదరాబాద్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు 1,61,950గా నమోదుకాగా, 22 క్యారెట్ల బంగారం ధర 1,48,450కు చేరింది. వెండి ధర ఒక్కరోజులోనే 10 వేల పెరిగి కిలోకు 3,75,000గా నమోదైంది.

# యంత్రాంగం సిద్ధంగా ఉండాలి

**కలెక్టర్లు, ఎస్పీలతో ఎన్నికల కమిషనర్ సమీక్ష**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, డీజీపీ బి. శివధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాణి కుముదిని మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతాల్లో జరిగే ఎన్నికలు కావడంతో అధికారులు, పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికలు స్వేచ్ఛా, న్యాయసమ్మతంగా, పారదర్శకంగా జరిగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వేద న్యూస్
బుధవారం జనవరి 28, 2026

# చైల్డ్ ట్రాకింగ్ అండ్ మానిటరింగ్ సిస్టం క్యాంప్ ప్రారంభం



**వేద న్యూస్, కాజీపేట:**

కాజీపేట రైల్వే స్టేడియం సమీపంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో చైల్డ్ ట్రాకింగ్ అండ్ మానిటరింగ్ సిస్టంకు సంబంధించిన అవగాహన క్యాంపును సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లలకు ట్రాకింగ్ కార్డులు అమర్చడంతో పాటు, వారి భద్రతకు సంబంధించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లలు తప్పిపోయిన సందర్భాల్లో ఈ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతుందని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జాయింట్ డైరెక్టర్ నర్మద, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, కాజీపేట ట్రాఫిక్ సీఐ వెంకన్న, కాజీపేట సీఐ సుధాకర్ రెడ్డి, కాజీపేట ఎస్ఐలు, ఆర్టీసీ డిపో మేనేజర్ రవిచంద్ర, ప్రయాణికులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

మేడారం జాతరలో ప్లాస్టిక్ నివారించే క్రమంలో ప్రయాణికులకు,ఆర్టీసీ సిబ్బందికి జ్యూటుతో తయారు చేసిన బ్యాగులను పంపిణీ చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ తెలిపారు. సమ్మక్క-సారలమ్మ జాతరలో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను నియంత్రించే క్రమంలో జ్యూట్ తో తయారు చేసిన వారిని పంపిణీ చేయడం జరిగింది. జాతర పోయే భక్తులు బంగారం, ఇతర వస్తువులను కవర్లో తీసుకపోవడాన్నిగుర్తించి వాటిని నిరోధించే క్రమంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు,ఆర్టీసీ సిబ్బందికి ఇంతేజార్ గంజ్ సీఐ షకూర్ తో కలిసి పంపిణీ చేశారు.

# ఆదర్శ గ్రామంగా పిప్పిరి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దత్తతతో అభివృద్ధి పరుగులు
- సర్పంచ్ చొరవతో గ్రామంలో సమగ్ర మార్పులు

**వేద న్యూస్, బజార్హత్నూర్:**

రాష్ట్ర ప్రభుత్వ అండతో పాటు గ్రామ సర్పంచ్ చొరవ ఫలితంగా పిప్పిరి గ్రామం నేడు ఆదర్శ గ్రామంగా రూపుదిద్దుకుంటోంది. తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పిప్పిరి గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. దత్తత తీసుకోవడంతో గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. నూతన పాలకవర్గం ఏర్పాటుతో పారిశుధ్యం, ఇందిరమ్మ ఇండ్లు, సంక్షేమ పథకాల అమలు పూర్తిస్థాయిలో జరుగుతున్నాయి. విద్య, ఆరోగ్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధతో పాఠశాలల ఆధునీకరణ, అంగన్వాడీ బలోపేతం, ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నారు. వ్యవసాయానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, ఉపాధి హామీ పథకం అమలుతో నీటి నిల్వలు పెరిగి వలసలు తగ్గాయని అధికారులు తెలిపారు. ఉపముఖ్యమంత్రి దత్తతతో గ్రామ రూపురేఖలు మారాయని, ప్రభుత్వం, సర్పంచ్‌పై విశ్వాసం పెరిగిందని గ్రామస్తులు పేర్కొన్నారు.



# చిన్నారులకు పెన్నులు, బాక్సుల పంపిణీ



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం అనంతపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో కన్నం సుదర్శన్ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, కంపాస్ బాక్సులు పంపిణీ చేశారు. అలాగే అంగన్వాడీ విద్యార్థులకు పలకలు, పెన్సిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఆదివారం తాను సొంతంగా విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్ నిర్వహిస్తానని కన్నం సుదర్శన్ హామీ ఇచ్చారు. గురుకుల, సైనిక్, నవోదయ పాఠశాలలతో పాటు గ్రామంలోని 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులందరికీ ఈ సేవలు అందిస్తానని తెలిపారు. ఈ ప్రకటనపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కన్నం సుదర్శన్, భవండ్ల కమలాకర్, గడ్డం వినయ్, కన్నం నవీన్, మల్లరపు గణేష్, గంగాధర నరేష్, సురేష్, బత్తిని మహేష్, తోడేటి శ్రీకాంత్, మనోజ్, నితిన్, శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారిపేట జాతర పనులు పరిశీలించిన డీసీపీ




**వేద న్యూస్, అమ్మవారిపేట:**

హనుమకొండ జిల్లా కాజీపేట మండలం అమ్మవారిపేట గ్రామంలో సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి జాతర ఏర్పాట్లను పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణ, జనసంద్ర నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మడికొండ సీఐ పుల్యాల కిషన్, ఎస్ఐ రాజబాబు, పోలీస్ సిబ్బంది, 44వ డివిజన్ స్థానిక కార్పొరేటర్ జలగం అనిత రంజిత్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బస్టాండ్ ఆవరణలో ప్రమాదకరంగా మూల మలుపు

- చెట్లు తొలగించాలని గ్రామస్తుల డిమాండ్



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం అనంతపల్లి గ్రామంలోని బస్టాండ్ ఆవరణలో ఉన్న మూల మలుపు ప్రమాదకరంగా మారింది. మలుపు వద్ద ఉన్న చెట్ల కారణంగా రహదారి స్పష్టంగా కనిపించకపోవడంతో బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ప్రాంతంలో ఎప్పుడైనా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు, విద్యార్థులు, వృద్ధులు ఈ మలుపు వద్ద భయంతో రహదారి దాటాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు చెబుతున్నారు. ఈ పరిస్థితిని వెంటనే పరిష్కరించి ప్రమాదాన్ని నివారించేందుకు మలుపు వద్ద ఉన్న చెట్లను తొలగించాలని గ్రామ ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు. ఆలస్యం చేస్తే పెద్ద ప్రమాదం జరిగే అవకాశముందని వారు హెచ్చరిస్తున్నారు.

# 50శాతం రాయితీపై ట్రైకోడెర్మా విరిడి, వేపనూనె



**వేద న్యూస్, బోయినిపల్లి :**

బోయినిపల్లి మండలంలో జాతీయ ఆహార భద్రతా పథకం కింద ట్రైకోడెర్మా విరిడి, వేపనూనె 50 శాతం రాయితీపై మండలంలోని నాలుగు రైతు వేదికలలో అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. ట్రైకోడెర్మా విరిడి అనే జీవ శిలీంధ్రం వరి, మొక్కజొన్న, ప్రత్తి, మిరప, కంది, కూరగాయ పంటల్లో కాయకుళ్లు, కాండం కుళ్లు, ఎండు తెగులు, అగ్గి తెగులు వంటి రోగాల నివారణకు ఉపయోగపడుతుందని వ్యవసాయ శాఖ అధికారులు వివరించారు. అలాగే వేపనూనె 1500 పీపీఎం ద్వారా తెల్ల దోమ, నల్లి, కాండం తొలుచు పురుగు, ఆకు ముడత వంటి పురుగుల గుడ్లు, పిల్ల పురుగులను సమర్థంగా నియంత్రించవచ్చని తెలిపారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె. ప్రణీత పత్రికా ముఖంగా రైతులను కోరారు.

# ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

- అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి
- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

వచ్చే నెల ఫిబ్రవరి 25 నుంచి మార్చి 16 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్‌లో అదనపు ఎస్పీ డి. చంద్రయ్యతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ప్రశ్నపత్రాలను పరీక్షా కేంద్రాలకు తరలించే సమయంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గుర్తింపు పొందిన అధికారులు, సిబ్బంది తప్ప ఇతరులు ఎవరూ పరీక్షా కేంద్రాల్లో ఉండరాదని స్పష్టం చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని వైద్య శాఖ అధికారులు ప్రతి పరీక్షా కేంద్రంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. అక్రమాలు నివారించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించాలని ఆదేశించారు. అవసరమైన చోట మహిళా పోలీస్ సిబ్బందిని విధుల్లో నియమించాలని తెలిపారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శరత్ కుమార్‌తో పాటు వైద్య ఆరోగ్య, విద్యుత్, రెవెన్యూ, పోస్టల్, ఇంటర్మీడియట్ విద్య, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# డాలర్లు సంపాదిస్తున్నా మూలాలను మర్చిపోని కవి అఫ్సర్

- మఖ్దూం పురస్కార సభలో గోరటి వెంకన్న

**వేద న్యూస్, హైదరాబాద్:**



అమెరికాలో ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నప్పటికీ తన మూలాలను మరచిపోని కవి అఫ్సర్ అని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. ప్రభుత్వ సిటీ కాలేజీలో జరిగిన మఖ్దూం మొహియుద్దీన్ జాతీయ అవార్డు ప్రదాన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మఖ్దూం అవార్డును అఫ్సర్‌కు ఇవ్వడం అవార్డుకే గౌరవమని పేర్కొంటూ, అఫ్సర్ కవిత్వంలో తాత్వికత, వేదన ప్రతి ఫలిస్తాయని అన్నారు. మీ కోసం కాదు.. లోకం కోసం బతకండి.. అంటూ విద్యార్థులకు హితవు చెప్పారు. పురస్కార గ్రహీత అఫ్సర్ మాట్లాడుతూ, మఖ్దూం మొహియుద్దీన్ జాతీయ అవార్డు స్వీకరించడం తనకు ప్రత్యేక సంతృప్తినిచ్చిందన్నారు. మఖ్దూం తెలంగాణలోని ప్రతి ఉద్యమంలో భాగమయ్యారని పేర్కొంటూ, విద్యార్థులు కనీసం ఒక్క మఖ్దూం కవితనైనా చదవాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్. ప్రసాద్ మాట్లాడుతూ, అర్హులకు అవార్డు ఇవ్వడం అవార్డుకే గౌరవమని అన్నారు.


# అంగన్వాడీ చిన్నారులకు యూనిఫామ్స్ పంపిణీ

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం-3 విద్యార్థులకు గ్రామ సర్పంచ్ కాత మల్లేశం యూనిఫామ్స్ పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అంగన్వాడీ పిల్లలకు కూడా ప్రభుత్వం యూనిఫామ్స్ అందజేయడం హర్షించదగిన విషయమని అన్నారు. యూనిఫారం అనేది పిల్లలకు గుర్తింపుతో పాటు గౌరవాన్ని కలిగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోదాని మహేష్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు అమరేందర్, స్రవంతి, అంగన్వాడీ టీచర్ మీసాల హంసలీల, ఆయా జోగు అంజలి, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# సీఎం కప్ ఏర్పాట్లపై మండల కమిటీ సమావేశం



**వేద న్యూస్, బోయినిపల్లి :**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం లో సీఎం కప్ టోర్నమెంట్ నిర్వహణకు సంబంధించిన మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈ నెల 28వ తేదీ ఉదయం 9 గంటలకు బోయినిపల్లి జడ్పి హెచ్ఎస్ పాఠశాలలో మండల స్థాయి సీఎం కప్ టోర్నమెంట్ ప్రారంభించాలని నిర్ణయించారు. షెడ్యూల్ ప్రకారం 28వ తేదీన కబడ్డీ, ఓపెన్ కేటగిరీలో వాలీబాల్, అండర్18 విభాగాల పోటీలు నిర్వహించనున్నారు. 29వ తేదీన కోకోతో పాటు 14 నుంచి 21 ఏళ్ల వయసు కేటగిరీల్లో అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయి. ఈ సమావేశంలో మండల అభివృద్ధి అధికారి బి. జయశీల, మండల విద్యాధికారి శ్రావణ్ కుమార్, తహసీల్దార్ నారాయణ రెడ్డి, ఎస్ఐ రమాకాంత్, పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు. టోర్నమెంట్‌ను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కమిటీ నిర్ణయించింది.

# సమ్మక్కను దర్శించుకున్న మహిళా కాంగ్రెస్ నేత



**వేద న్యూస్, అమ్మవారిపేట:**

కాజీపేట మండలం 44వ డివిజన్ అమ్మవారిపేటలోని సమ్మక్క–సారలమ్మ ఆలయాన్ని మంగళవారం హనుమకొండ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సోమ కరుణ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 44వ డివిజన్ అధ్యక్షుడు, కాంటెస్ట్ కార్పొరేటర్ రాజారపు స్వామి, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు గుర్రం జ్యోతి అమర్నాథ్, కాజీపేట మండల అధ్యక్షురాలు నీలం రజిని వేణు, డివిజన్ అధ్యక్షురాలు కాయిత కవిత, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాయిత శ్రీనివాస్, ధర్మకర్త చీమల రాజ్ కుమార్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు రాజారపు కిరణ్, నాగపురి శ్రీకాంత్, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ వల్లాల దయాకర్, యూత్ కాంగ్రెస్ నాయకులు జక్కుల నవీన్ యాదవ్, ధర్మకర్తలు మైదం శ్రీవిద్య, జన్ను రమ్య తదితరులు పాల్గొన్నారు.

# పొలం వద్ద నుంచి బైక్ చోరీ



**వేద న్యూస్, కారేపల్లి:**

కష్టపడి పనిచేసుకునే సామాన్య వ్యక్తికి తీరని అన్యాయం జరిగింది. మండల కేంద్ర పరిధిలోని భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీకి చెందిన సామ్యతండ నివాసి వాంకుడోత్ కృష్ణ (గన్య) కు చెందిన గ్లామర్ బైక్ గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. డెకరేషన్ పనుల నిమిత్తం సాగర్, కృష్ణ ఇద్దరూ కారేపల్లి నుంచి ఇల్లందు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న తమ పొలం వద్ద బైక్‌ను నిలిపి ఉంచారు. పనులు ముగించుకుని తిరిగి వచ్చి చూసేసరికి వాహనం అక్కడ లేకపోవడంతో వారు అవాక్కయ్యారు. రద్దీగా ఉండే రోడ్డు పక్కనే ఈ చోరీ జరగడం స్థానికంగా కలకలం రేపుతోంది. ఈ ప్రాంతంలో ఎవరికైనా అనుమానాస్పదంగా ఈ బైక్ కనిపిస్తే లేదా గుర్తుతెలియని వ్యక్తులు వాహనాన్ని తీసుకెళ్లడం గమనించి ఉంటే, వెంటనే మానవతా దృక్పథంతో 90105 30496, 89787 91656 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని బాధితులు కోరుతున్నారు.

# మేడారం జాతర గోడపత్రిక ఆవిష్కరణ



**వేద న్యూస్, కారేపల్లి:**

తెలంగాణ కుంభమేళాగా పేరు గాంచిన, ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్ద జాతర గా గుర్తింపు పొందిన సమ్మక్క - సారలమ్మ జాతరకు సంబంధించిన గోడ పత్రికలు, ఫ్లెక్స్‌లను కారేపల్లి గ్రామ సర్పంచ్ హీరాలాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు సమ్మక్క–సారలమ్మ జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేపట్టి, భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి పెండ్రా అనిల్ కుమార్, వార్డ్ సభ్యుడు గాంధీ, జీపీఎస్ సామ్యతండ ఉపాధ్యాయులు బాలాజీ, యూత్ నాయకులు లావుడ్య నగేష్ భద్ర, పంచాయితీ సిబ్బంది హెంచంద్, రాందాస్, రమేష్, గణేష్, రాధ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు



**వేద న్యూస్, కారేపల్లి :**

చలికాలం ప్రారంభమై సీజనల్ వ్యాధులు పొంచి ఉన్న నేపథ్యంలో విశ్వనాధపల్లి గ్రామ పంచాయతీ యంత్రాంగం అప్రమత్తమైంది. గ్రామ సర్పంచ్ ఇస్లావత్ రాజు దిశానిర్దేశంలో మంగళవారం గ్రామంలో భారీ ఎత్తున శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని చలికాలంలో వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను నివారించేందుకు కాలువల్లో పూడిక తీత పనులను పంచాయతీ సిబ్బందితో కలిసి సర్పంచ్ స్వయంగా పర్యవేక్షించారు. వీధి వీధినా బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు దోమల నివారణకు ఫాగింగ్, యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించారు. పారిశుధ్య పనుల సందర్భంగా సర్పంచ్ ప్రజలకు చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

# నర్సరీని సందర్శించిన తాటిగూడ సర్పంచ్



**వేద న్యూస్, కాసిపేట:**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని మంగళవారం తాటిగూడ సర్పంచ్ మడావి వెంకటేష్ సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీలో పెరుగుతున్న మొక్కల స్థితిగతులను, వాటి సంరక్షణ విధానాలను స్వయంగా పరిశీలించారు. నర్సరీలో పెంచుతున్న వివిధ రకాల పండ్ల మొక్కలు, పూల మొక్కలు, నీడనిచ్చే మొక్కల ఎదుగుదలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పెట్టడం, సమయానికి ఎరువులు వేయడం, పురుగుల నుండి రక్షణ కల్పించడం వంటి అంశాలపై నర్సరీ కార్మికులకు సూచనలు ఇచ్చారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామంలోని ప్రతి ఇంటికీ, ఖాళీ ప్రదేశాల్లో నాటేందుకు సరిపడా మొక్కలను సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామాన్ని పచ్చదనంతో నింపడమే లక్ష్యమని, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మౌనిక, ఫీల్డ్ అసిస్టెంట్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్మెంట్ బకాయిలను విడుదల చేయాలి

**- బిజెపి మహాధర్నాలో ఎమ్మెల్సీ మల్క కొమరయ్య డిమాండ్**



**వేద న్యూస్, హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఇరవై ఒక్క వేల ఐదు వందల మంది ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల పీఆర్సీ, డీఏ, ఇన్సూరెన్స్ , ఎన్ క్యాష్ మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని బిజెపి టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఇందిరా పార్కులోని ధర్నాచౌక్ లో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావు అధ్యక్షతన ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, ఏవీఎన్ రెడ్డి, అంజిరెడ్డి లు ప్రభుత్వ రిటైర్మెంట్ ఉద్యోగుల ప్రయోజనాలను తక్షణమే చెల్లించాలని బిజెపి మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, బిజెఎల్పీ లీడర్ మహేశ్వర్ రెడ్డి,కాటిపల్లి వెంకట రమణా రెడ్డి,మాజీ ఎమ్మెల్సీలు పొంగులేటి సుధాకర్ రెడ్డి, కాటేపల్లి జనార్ధన్ రెడ్డి,రాజశేఖర్ రెడ్డి (తపస్ రాష్ట్ర అధ్యక్షులు), హన్మంతరావు, పెంటయ్య, రిటైర్మెంట్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దామోదర్ రెడ్డి, తపస్, పీఆర్టీయూ నాయకులు, రిటైర్మెంట్ ప్రభుత్వ ఉద్యోగులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్క కొమరయ్య టీచర్స్ ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న రిటైర్మెంట్ ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి 21,500మందికి రిటైర్మెంట్ ప్రయోజనాలతో పాటు సర్వీస్ లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య డిమాండ్ చేశారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని హామీచ్చి తీరా అధికారంలోకి 18 నెలలు గడుస్తున్న బకాయిలను విడుదల చేయకపోవడం వల్ల వారు ఆర్థిక సమస్యలను ఎదుర్కుంటున్నారు. డీఏ, పీఆర్సీ, హెల్త్ ఇన్సూరెన్స్, గ్రూప్ ఇన్సూరెన్స్, పెన్షన్ బకాయిలను ఏకమొత్తంగా వెంటనే చెల్లించి, రిటైర్డ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి .ప్రభుత్వం దిగివచ్చి, రిటైర్డ్ ఉద్యోగులతో పాటు సర్వీస్‌లో ఉన్న ఉద్యోగుల బకాయిలను కూడా విడుదల చేసే వరకు క్షేత్రస్థాయిలో పోరాటం చేస్తూ, తెలంగాణ బిజెపి తరపున ఉద్యోగుల పక్షాన అండగా నిలుస్తాము.కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ, డీఏ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ను చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య కోరారు.

# వైద్య విద్య నిమిత్తం దేహ దానం




**వేద న్యూస్, వరంగల్:**

వరంగల్ దేశాయిపేట షాదీఖాన్ నివాసి మోతె సమ్మయ్య మంగళవారం మృతి చెందగా, సమాజ హితం కోరి ఆయన కుటుంబ సభ్యులు దేహ దానానికి అంగీకరించారు. తల్లి లక్ష్మి, భార్య భాగ్యమ్మ, తమ్ముడు సారంగపాణి, మరదలు సమ్మక్క కలిసి సమ్మయ్య దేహాన్ని వైద్య విద్య నిమిత్తం మెడికల్ కాలేజీకి దానం చేశారు. తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అంబులెన్స్‌లో సమ్మయ్య దేహాన్ని కాకతీయ మెడికల్ కాలేజీకి తరలించి, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య, అనాటమీ విభాగాధిపతి డాక్టర్ శశికాంత, అనాటమీ సిబ్బంది ప్రేమ్ కుమార్, యాదగిరి, ప్రణయ్ సమక్షంలో అనాటమీ విభాగానికి అప్పగించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. దేహదానం ద్వారా భవిష్యత్తు వైద్యులు శస్త్రచికిత్సలు, శాస్త్రీయ పరిశోధనలు, వైద్య విద్యను అభ్యసించగలరని తెలిపారు. దేహదానం చేసిన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ శరీర దానానికి పూర్తి సమన్వయం, సహకారం అందించిన పాలడుగుల సురేందర్, ఆయన సతీమణికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కోన్ రెడ్డి మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, పాలడుగుల సురేందర్, సమ్మయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రమాదాలకు కారణం ట్రాఫిక్ నిబంధనల నిర్లక్ష్యం

**- గంగా ధర ఎస్సై వంశీకృష్ణ**
**- రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు**

**వేద న్యూస్, గంగాధర :**

రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే లక్ష్యంతో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన సదస్సును గంగాధర మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక ఎస్ఐ వంశీకృష్ణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా సంభవించడానికి ప్రధాన కారణం ట్రాఫిక్ నిబంధనలను నిర్లక్ష్యం చేయడమేనని అన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాల్సిన బాధ్యత ఉందని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. ఇవి ప్రమాదాల సమయంలో ప్రాణాలను రక్షించే ముఖ్యమైన భద్రతా చర్యలని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల తీవ్రమైన ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అధిక వేగంతో వాహనాలు నడపకుండా వేగ నియంత్రణ పాటించాలని, వాహనం నడుపుతున్న సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించకూడదని తెలిపారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవిస్తూ వాహనాలు నడపడం ప్రతి పౌరుని కర్తవ్యమని అన్నారు. అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచి, రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించడమే ప్రధాన లక్ష్యమని ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు, ప్రజలు, యువకులు పాల్గొన్నారు. అనంతరం వారితో రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తామని, ఇతరులకు కూడా అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

# బాధిత కుటుంబాలకు అండ సీఎంఆర్ఎఫ్

**- లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన సర్పంచ్**



**వేద న్యూస్, కాసిపేట:**

ఆపదలో ఉన్న పేదలకు ప్రభుత్వం అందించే సీఎంఆర్ఎఫ్ ఒక వరమని తాటిగూడ గ్రామ సర్పంచ్ మడావి వెంకటేష్ తెలిపారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, కాసిపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రత్నం ప్రదీప్ ఆదేశాల మేరకు తుంగగూడ గ్రామానికి చెందిన పేరం సూరవ్వతో పాటు అనారోగ్యంతో చికిత్స పొందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను సర్పంచ్ స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి అందజేశారు. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా లబ్ధిదారుల ఇంటి వద్దకే చెక్కులు అందజేయడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పేదల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి అండగా నిలుస్తామని తెలిపారు. కష్టకాలంలో ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందడంపై, అలాగే సర్పంచ్ ప్రత్యేక చొరవ తీసుకుని చెక్కులు అందజేయడంపై లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు గుండవేని రాజశేఖర్, నాయకులు ముత్యాల నాగేష్, ముత్యం రాజన్న తదితరులు పాల్గొన్నారు.

# రుద్రూర్ పీహెచ్సీ తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి రాజశ్రీ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ప్రసవాల గది, ప్రయోగశాల, మందుల పంపిణీ విభాగాలను పరిశీలించి సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీలో వైద్యాధికారిణి అయేషా సిద్ధిక, సూపర్వైజర్ రవి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

వేద న్యూస్

బుధవారం జనవరి 28, 2026

# నామినేషన్లకు అన్ని ఏర్పాట్లు చేయాలి

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- మున్సిపల్ కార్యాలయం సందర్శన



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

మున్సిపల్ కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించిన ఆమె, మున్సిపల్ ఎన్నికల సందర్భంగా నామినేషన్ల స్వీకరణకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణకు ఎన్ని కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారో, వాటిలో ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారో మున్సిపల్ కమిషనర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, సహాయార్థం ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే ఎన్‌ఓసీ కౌంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నామినేషన్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, క్రమబద్ధంగా జరిగేలా చూడాలని అధికారులకు ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్శనలో మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితర అధికారులు పాల్గొన్నారు.

# సమ్మక్క-సారలమ్మ గద్దెల ప్రతిష్ఠ

**వేద న్యూస్, కారేపల్లి :**



భక్తిశ్రద్ధలు, ఆదివాసీల సంప్రదాయ ఆచారాల నడుమ జూలూరుపాడు మండల పరిధిలోని పడమటి నర్సాపురం గ్రామంలో సమ్మక్క-సారక్క జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పాల్గొన్నారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు, ఆదివాసీ పెద్దలు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. జాతరలో అత్యంత కీలకమైన సమ్మక్క-సారక్కల గద్దెల ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్యేకంగా పాల్గొని పూజలు నిర్వహించారు. అమ్మవార్లను గద్దెలపై ప్రతిష్ఠించే పవిత్ర ఘట్టంలో పాలుపంచుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలకు సమ్మక్క-సారక్క జాతర నిలువెత్తు నిదర్శన మని, ఆదివాసీల ఆరాధ్య దైవాలైన అమ్మవార్ల ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని అన్నారు.

# వితంతు పింఛన్ సమస్యకు తక్షణ పరిష్కారం

- చొరవ చూసిన సర్పంచ్



**వేద న్యూస్, కాసిపేట:**

మంజూరైన వితంతు పింఛన్ అందక గ్రామ పంచాయతీ పరిధిలోని పోసక్క ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయం గ్రామ సర్పంచ్ కొట్నాక రఘుపతి దృష్టికి వెళ్లగా, వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి పింఛన్ మంజూరు చేయించారు. మంగళవారం స్వయంగా అక్కడే ఉండి లబ్ధిదారురాలికి డబ్బులు అందేలా చర్యలు తీసుకున్నారు. పేద వృద్ధ మహిళకు సమయానికి సహాయం అందేలా చొరవ తీసుకున్న సర్పంచ్‌ను గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జంజిరాల సందీప్, మాజీ ఎంపీటీసీ మాడవి బింరావ్, మండల యువజన ఉపాధ్యక్షుడు తాటిపాముల సాయి కిరణ్, సోషల్ మీడియా గ్రూప్ అడ్మిన్ సాయి చరణ్, యువజన అధ్యక్షుడు రొడ్డ సృజన్, జంజిరాల తిరుపతి, దొంతుల తిరుపతి, సల్లం వెంకటరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు

# గుంతలు పడ్డ రోడ్డుకు మరమ్మతులు

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో గుంతలు పడ్డ రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టారు. నూతనంగా గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన గన్నేరం వసంత ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా తొలి అడుగు వేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా ముందుగా రోడ్డు పనులను ప్రారంభించారు. బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో స్వయంగా పర్యవేక్షిస్తూ రోడ్డు వ్యవస్థను బాగు చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ గన్నేరం వసంత మాట్లాడుతూ, గ్రామంలో పూర్తిస్థాయిలో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తానని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను క్రమంగా నెరవేర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు లింగంపల్లి అనిల్ కుమార్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# దొంగతనం కేసులో నిందితుడికి మూడేళ్లు జైలు

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



దొంగతనం కేసులో నిందితుడికి మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.3వేలు జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పు వెలువరించినట్లు పట్టణ సీఐ కృష్ణ తెలిపారు. చంద్రంపేటకు చెందిన అనగందుల గోపి ఫిర్యాదు మేరకు, శివనగర్ సిరిసిల్లకు చెందిన కొండా రంజిత్ 2020 అక్టోబర్ 15న గోపికి చెందిన కెనాన్ 1300డి మోడల్ ఫోటో కెమెరాను చోరీ చేసినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. కెమెరా విలువ సుమారు రూ.38 వేలుగా ఉన్నట్లు తెలిపారు. అప్పటి ఎస్ఐ జి. సుధాకర్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా, సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ చేలమల సందీప్ వాదనలు వినిపించగా, కోర్టు కానిస్టేబుల్ వేముల నరేష్ ఆధ్వర్యంలో సాక్షులను హాజరుపరిచినట్లు సీఐ కృష్ణ తెలిపారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

**వేద న్యూస్, మందమర్రి:**




ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పట్టణ ఏఎస్ఐ మిలింద్ కుమార్ తెలిపారు. ఎస్ఐ నరేష్ ఆదేశాల మేరకు పోలీసులు ప్రభుత్వ జూనియర్ కాలేజీ సమీపంలో పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సమయంలో పాలవాగు నుంచి మందమర్రి వైపు వస్తున్న ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేయగా, అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, ట్రాక్టర్ యజమాని కుమారుడి ప్రోద్బలంతో తక్కువ సమయంలో ఎక్కువ లాభం పొందాలనే ఉద్దేశంతో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు అంగీకరించినట్లు ఆయన తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**



రాష్ట్రంలో జరగనున్న మునిసిపల్ ఎన్నికలను పూర్తిస్థాయి పారదర్శకతతో, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఇతర ఎన్నికల ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులతో ఎన్నికల సన్నాహాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని మునిసిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి అంశంలో పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంటుందని, నామినేషన్ ప్రక్రియ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. జోనల్, నోడల్ అధికారులు, రిటర్నింగ్ మరియు సహాయ రిటర్నింగ్ అధికారులు, పిఓలు, ఏపిఓలు, ఎన్నికల సిబ్బంది నియామకం, శిక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా పాటించేలా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలు, నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తును పటిష్టంగా ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ సౌకర్యం కల్పించాలని సూచించారు. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగేలా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలోని ఏదులాపురం, కల్లూరు, మధిర, వైరా, సత్తుపల్లి మునిసిపాలిటీల పరిధిలోని 117 వార్డులకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. వెబ్‌కాస్టింగ్, నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు నియామకం, శిక్షణ, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. అధికారుల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డీఆర్‌డీఓ సన్యాసయ్య, జిల్లా ఉపాధి అధికారి శ్రీరామ్, సీపీఓ శ్రీనివాస్, డీపీఓ రాంబాబు, ఆర్టీఓ జగదీష్, డీసీఓ గంగాధర్, మునిసిపల్ కమిషనర్లు, తదితర అధికారులు పాల్గొన్నారు.

# అరణ్య సంరక్షణతోనే గ్రామీణ ఆర్థికాభివృద్ధి



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**

తెలంగాణ రైజింగ్- విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా అరణ్యాలపై పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించడం, అక్రమ ఆక్రమణలను నియంత్రించడం, మానవ- వన్యప్రాణి సంఘర్షణలను నివారించడం లక్ష్యంగా ఖమ్మం జిల్లా అటవీ శాఖ వినూత్న అడుగు వేసింది. అరణ్య సంరక్షణను గ్రామీణ ఆర్థికాభివృద్ధితో అనుసంధానిస్తూ, అరణ్యాలపై ఆధారపడే సముదాయాలకు స్థిరమైన గ్రీన్ జీవనోపాధులు కల్పించేందుకు రూపొందించిన ప్రత్యేక కార్యక్రమమే "తెలంగాణ వన్ జీవన్‌ధారా- ఖమ్మం అని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖమ్మం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ పైలట్ ప్రాజెక్టును ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్‌లతో కలిసి అధికారికంగా ప్రారంభించారు. ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ అడవులను రక్షించుకుంటూనే సముదాయ ఆధారిత గ్రీన్ జీవనోపాధులను అభివృద్ధి చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు స్థానిక ప్రజలకు స్థిరమైన ఉపాధి లభిస్తుందని అన్నారు. "తెలంగాణ రైజింగ్ విజన్ 2047" లక్ష్యాలకు అనుగుణంగా వన సంరక్షణ సమితులను స్వయం ఆధారిత గ్రీన్ ఎంటర్‌ప్రైజ్‌లుగా తీర్చిదిద్దే ఈ వినూత్న ప్రయత్నం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో అరణ్య సంరక్షణ ఫలితాలు మరియు సముదాయ ఆదాయం రెండింటినీ ఒకే పాలనా వ్యవస్థలో అనుసంధానిస్తూ స్థిరమైన జీవనోపాధులను అమలు చేయడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని తెలిపారు. "అరణ్యాలను నాశనం చేయకుండా, అరణ్యాల నుంచే ఆదాయం" అనే సిద్ధాంతమే ఈ కార్యక్రమానికి పునాదిగా పేర్కొన్నారు. వన సంరక్షణ సమితులను స్వయం ఆధారిత గ్రీన్ ఎంటర్‌ప్రైజ్‌లుగా తీర్చిదిద్ది, పర్యావరణ భద్రతతో పాటు గ్రామీణ సమగ్రాభివృద్ధి సాధించడమే లక్ష్యమని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి, యూనిట్ల స్థాపన, మార్కెట్ అనుసంధానం, ప్రభుత్వకార్పొరేట్ భాగస్వామ్యాల ద్వారా వీఎస్‌ఎస్‌లను పనితీరు ఆధారిత సముదాయ సంస్థలుగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. నెలవారీ కెపిఐలు, పారదర్శక లెక్కలు, ఆడిట్ క్రమశిక్షణతో ప్రాజెక్టు అమలు చేస్తామని తెలిపారు. ఇప్పటికే ఉన్న యూనిట్ల బలోపేతం వ్యవసాయ పరికరాలు, ట్రాక్టర్లు, ఆటోలు, టెంట్ యూనిట్లు, లీఫ్ ప్లేట్ యూనిట్లు వంటి ఆస్తులను వ్యాపార ప్రణాళికలు, మార్కెట్ లింకేజీల ద్వారా స్థిర ఆదాయ వనరులుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పథకాలు- భాగస్వామ్యాలు కేంద్ర ప్రభుత్వ పథకాలు అయిన జీఐఎం, కాంపా, నేషనల్ బాంబూ మిషన్, పీఎంఈజిపి/ఎంఎస్‌ఎంఇ, పీఎం కుసుమ్, పీఎం సూర్య ఘర్ వంటి పథకాలను సద్వినియోగం చేసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక శాఖ, సెర్ప్, గ్రామీణాభివృద్ధి, ఎంఎస్‌ఎంఇ శాఖలతో పాటు జైకా, సిఎస్‌ఆర్ సంస్థలు, ఎన్జీవోల భాగస్వామ్యం తీసుకోనున్నట్లు వివరించారు. 2047 నాటికి ఈ కార్యక్రమాన్ని జిల్లా అంతటా విస్తరించి, ఖమ్మం జిల్లాను పర్యావరణఆర్థిక వృద్ధిలో అగ్రగామిగా నిలబెట్టడం లక్ష్యమని జిల్లా అటవీ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో సన్యాసయ్య, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, ఎఫ్‌డీవో మంజుల, తదితర అధికారులు పాల్గొన్నారు.

# పేద కుటుంబానికి అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి

- అన్వర్ పాషాకు రూ.2.20 లక్షల చెక్కు అందజేత - మంత్రి పొంగులేటి చొరవతో ఆర్థిక వెసులుబాటు

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**



అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) భరోసానిచ్చింది. ఏదులాపురం మున్సిపాలిటీ రెండో వార్డుకు చెందిన షేక్ అన్వర్ పాషా కుమారుడు ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం భారీగా ధనం వెచ్చించారు. ఈ విషయాన్ని స్థానిక యూత్ కాంగ్రెస్ నాయకుడు ఏనుగు మహేష్.. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లి సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తు చేయించారు. మంత్రి సిఫారసుతో ప్రభుత్వం నుంచి రూ.2,20,000 మంజూరయ్యాయి. మంగళవారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారుడు అన్వర్ పాషా ఈ చెక్కును అందుకున్నారు. కష్టకాలంలో తమ కుటుంబాన్ని ఆదుకున్న మంత్రికి, సహకరించిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వేద న్యూస్

బుధవారం జనవరి 28, 2026

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యం

- మధిరలో దివ్యాంగులకు రిట్రోఫిటెడ్ మోటార్ వాహనాల పంపిణీ
- రెండేళ్లలోనే 100 కోట్ల ఖర్చు : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**వేద న్యూస్, మధిర:**



దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. గత ప్రభుత్వాలు పదేళ్లలో చేయలేని పనులను ఈ ప్రభుత్వం రెండేళ్లలోనే చేసి చూపించిందని, అందులో భాగంగానే దివ్యాంగుల సంక్షేమానికి రూ.100 కోట్లను ఖర్చు చేశామని ఆయన వెల్లడించారు. మంగళవారం మధిర నియోజకవర్గ కేంద్రంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి దివ్యాంగులకు రిట్రోఫిటెడ్ ట్రైసైకిళ్లు, మోటార్ వాహనాలను డిప్యూటీ సీఎం పంపిణీ చేశారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ చదువుకుంటున్న దివ్యాంగ విద్యార్థులకు ఐప్యాడ్లు, ట్యాబ్లు, కంప్యూటర్లు అందజేస్తూ విద్యలో వెనుకబడకుండా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. తమది ప్రజల బాధలను అర్థం చేసుకునే ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వమని పేర్కొన్నారు. దివ్యాంగులకు ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా అన్ని విధాలుగా అండగా నిలుస్తామని, అవసరమైన ప్రతి సంక్షేమ పథకాన్ని అందిస్తామని భరోసా ఇచ్చారు. దురదృష్టవశాత్తు అంగవైకల్యంతో పుట్టిన వారిని కూడా సమాజంలో మనతో పాటు ముందుకు నడిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని అన్నారు. దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించగల సామర్థ్యం కలవారని, అందుకు అవసరమైన అవకాశాలు, సహకారం మరింతగా అందించాలని సూచించారు. అంగవైకల్యమే అడ్డంకిగా భావించకుండా వారిని ప్రోత్సహించి ముందుకు తీసుకెళ్లడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం దివ్యాంగుల గౌరవం, ఆత్మవిశ్వాసం పెంచే దిశగా పనిచేస్తోందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ఇరిగేషన్ ఎస్ఈ వాసంతి, విద్యుత్ ఎస్ఈ శ్రీనివాస చారి, ఆర్ & బి ఎస్ఈ యాకుబ్, జిల్లా సంక్షేమ అధికారిణి వేల్పుల విజేత, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముజాహిద్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహారావు, వ్యవసాయ శాఖ ఏడి విజయ చందర్, మధిర తహసీల్దార్ రాంబాబు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ గ్రామ సర్పంచ్ సోలంకి పార్థివ దేహానికి నివాళి



**వేద న్యూస్, ఎల్కతుర్తి :**

ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన మాజీ గ్రామ సర్పంచ్ సోలంకి రాజేశ్వర్ రావు గత కొన్ని నెలల నుండి అనారోగ్యంతో బాధపడుతూ మరణించాడు. విషయం తెలుసుకున్న ఆరె కులస్తుల సంగం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన మాజీ చైర్మన్ ఆరెకుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నాగూర్ల వెంకన్న మరియు తెలంగాణ రైతు రక్షణ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు, తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, రాష్ట్ర కన్వీనర్ జెండా రాజేష్, రాష్ట్ర నాయకులు కౌడగాని నరసింహారావు, ఆరె కుల రాష్ట్ర కార్యదర్శి సుఖినే సంతాజి, ఆరె కుల జిల్లా సహాయ కార్యదర్శి అంబిర్ శ్రీనివాస్, ఆరె కుల మండల అధ్యక్షుడు కుడితాడి రాజు, బూర్గుల రామారావు, గ్రామ శాఖ అధ్యక్షుడు కథం రాజు, కారెట్లపల్లి నగేష్, మోరే బాబురావు, కారెట్లపల్లి రమేష్, సుకినే చిరంజీవి, వరికెల రాజేశ్వరరావు, అంబీర్ చంద్రరావు, కార్యకర్తలతో కలిసి రాజేశ్వర్ రావు పార్థివ దేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించి అంతక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరె కులస్తుల సంఘం నాయకులు మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి ప్రజాసేవలో సోలంకి రాజేశ్వర్ రావు చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు ఆయన మరణం పట్ల గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు ఈ దుఃఖ సమయంలో వారి కుటుంబ సభ్యులకు ఆరె కులస్తుల తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# పంచాయతీ కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**వేద న్యూస్, శంకరపట్నం:**



గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా శంకరపట్నం మండలం మెట్టుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో తమను జెండా ఎగరవేయనీయకుండా గ్రామ కార్యదర్శి తానే జెండా ఎగరవేసి తమ మనోభావాలను దెబ్బతీశారని ఆ గ్రామ సర్పంచ్ కొయ్యడ కుమార్ యాదవ్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సర్పంచ్ హోదాలో ఉన్న తమను జెండా ఎగరవేయకుండా చేసి గ్రామ ప్రజల ముందు అవమానించారని అన్నారు. మండలంలోని ఇతర గ్రామాల్లో సర్పంచులే జెండా ఎగరవేసినప్పటికీ, తమ అభ్యర్థనను పట్టించుకోకుండా కార్యదర్శి స్వయంగా జెండా ఎగరవేసినట్లు తెలిపారు. అంతేకాక, మధ్యాహ్నమే జెండాను దింపివేయడం ద్వారా జాతీయ జెండాను అవమానించినట్లు కూడా ఆరోపించారు. ఈ వ్యవహారంపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సర్పంచులే జెండా ఎగరవేస్తే, కేవలం మెట్టుపల్లి గ్రామంలో మాత్రమే కార్యదర్శి జెండా ఎగరవేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంలో చర్యలు తీసుకోకపోతే బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్, నాయకులు జంగ జైపాల్, కొయ్యడ అశోక్, జగ్గారెడ్డి, రాస మల్ల శ్రీనివాస్, రాజిరెడ్డి, బిజిలి సారయ్య, ఎలుకపల్లి సంపత్, రవి, రాములు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్కే-1ఏ పూజా కార్యక్రమాన్ని ప్రారంభించిన జీఎం

**వేద న్యూస్, మందమర్రి:**



పాలవాగు సమీపంలోని ఆర్కే-1ఏ గని వద్ద సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా నిర్వహించిన కంకవనం పూజా కార్యక్రమాన్ని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సమ్మక్క-సారలమ్మ జాతరలో ప్రధాన ఆరాధ్య దైవమైన సమ్మక్క రాకను పురస్కరించుకొని ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం కంకవనాన్ని పుణ్యక్షేత్రానికి తీసుకువస్తారని తెలిపారు. జాతర సమయంలో దేవతలను గద్దెలకు చేర్చడం, కంకవనాలు, కుంకుమ భరణితో కూడిన పూజలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వో టూ జీఎం ఎల్. ప్రసాద్, ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, ఏఐటీయూసీ రామకృష్ణాపూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, డీజీఎం పర్సనల్ అశోక్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ భూ శంకరయ్య, డీజీఎం ఐఈడీ కిరణ్ కుమార్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, మందమర్రి ఏరియా ఉన్నతాధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కెనాల్‌లో కొట్టుకుపోయిన అనిల్ మృతదేహం లభ్యం

**వేద న్యూస్, శంకరపట్నం:**



శంకరపట్నం మండలం అంబల్పూర్ గ్రామానికి చెందిన సాదుల అనిల్ (21) ఈ నెల 25వ తేదీ ఆదివారం ఎస్సారెస్పీ కెనాల్‌లో ప్రమాదవశాత్తు కొట్టుకుపోయాడు. ఈ ఘటన అనంతరం పోలీసులు, స్థానికులు గాలింపు చర్యలు చేపట్టగా, మంగళవారం (ఈ నెల 27) కొత్తగట్టు గ్రామ శివారులోని డంపింగ్ యార్డ్ సమీపంలో ఉన్న ఎస్సారెస్పీ కాలువలో అనిల్ మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అనిల్ తల్లి స్వరూపకు అప్పగించినట్లు స్థానిక ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపారు.

## డా. గుగ్గిళ్ల దివ్యమూర్తికి

# గద్దర్ స్మారక కళా పురస్కారం

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**



ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపరమేధావి డాక్టర్ గుగ్గిళ్ల దివ్యమూర్తికి గద్దర్ స్మారక కళా పురస్కారం లభించింది. ఈ పురస్కారాన్ని తెలుగు వెలుగు సాహితి వేదిక వారు అందజేశారు. ఈ పురస్కారాన్ని డాక్టర్ దివ్య మూర్తి హనుమకొండలోని ప్రెస్ క్లబ్ లో ప్రముఖ హాస్యనటులు సదానందం (ఆర్ఎస్ నంద) చేతుల మీదుగా తీసుకోవడం జరిగింది. తదనంతరం డాక్టర్ దివ్యమూర్తిని ప్రముఖులు సన్మానించారు. ప్రతిభను బట్టి ఈ అవార్డును అందజేస్తున్న మని సంస్థ సభ్యులు తెలియజే శారు. తనకు ఈ అవార్డు రావడం పట్ల డాక్టర్ దివ్యమూర్తి సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు తనకు 66 అవార్డులు వచ్చాయని, 116 వేదికల మీద సన్మానం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే , వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు,నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, మన్నెం నాగమల్లేశ్వరి, పోలోజు రాజ్ కుమార్, అద్దంకి నాగరాజు, ఐపీఎస్ రావుల గిరిధర్, సురేష్ లాల్, వెంపటి శ్రావణి, అప్పినపల్లి భాస్కరాచార్యులు, పొన్నె కంటి శ్రీనివాసచారి, వేముల తిరుపతిరెడ్డి, తది తరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎలక్ట్రీషియన్ దినోత్సవం

**వేద న్యూస్, మందమర్రి:**



ఎలక్ట్రీషియన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మందమర్రి ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో థామస్ ఆల్వా ఎడిసన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం సభ్యులతో కలిసి మార్కెట్ వ్యాపార సంఘం అధ్యక్షుడు తమ్మిశెట్టి విజయ్ కుమార్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వల్ల విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. దాదాపు 150 సంవత్సరాల క్రితం మనిషి సూర్యకాంతిపైనే ఆధారపడి జీవించేవాడని, నేడు విద్యుత్ వెలుగుతో సామాన్యుడికీ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఈ మార్పులకు మూలకారణం థామస్ ఆల్వా ఎడిసన్ వంటి శాస్త్రవేత్తల పరిశోధనలేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రీషియన్ కమిటీ అధ్యక్షుడు అజీజుర్ రెహమాన్, కార్యదర్శి పిల్లి మల్లేష్, ప్రచార కార్యదర్శి మల్లేష్, ఉపాధ్యక్షులు ఎండి రబ్బాని, పిట్టల కుమార్, కోశాధికారి జి. శేఖర్, కమిటీ సభ్యులు జి. జగదీష్, డి. రాజేష్, ఎ. సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఇరిగేషన్ సేవలకు ప్రశంస

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల జిల్లా:**




రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇరిగేషన్ శాఖ ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన అధికారిణిని జిల్లా కలెక్టర్ ప్రశంసించారు. నీటిపారుదల రంగంలో చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా అధికారి నాగుల రాహులికి కలెక్టర్ స్వయంగా ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యవసాయ అభివృద్ధి కి ఇరిగేషన్ వ్యవస్థ కీలకమని, రైతులకు సమయానికి నీరు అందేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. నీటిపారుదల ప్రాజెక్టులు, కాలువల నిర్వహణలో సమర్థవంతమైన సేవలు అందించడం వల్ల రైతులకు నేరుగా లాభం చేకూరుతోందని తెలిపారు. ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించామని, భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# గాయని మంజులకు స్వర్ణ నంది అవార్డు

**వేద న్యూస్, శంకరపట్నం:**



శంకరపట్నం మండలం అంబాలపూర్ గ్రామానికి చెందిన మంజుల హైదరాబాద్‌లో నిర్వహించిన ఆల్ ఇన్ వన్ టాలెంట్ అవార్డ్స్-2026 వేడుకల్లో ప్రతిష్టాత్మకమైన స్వర్ణ నంది అవార్డును సొంతం చేసుకుంది. చిన్ననాటి నుంచే గాయనిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మంజుల ప్రతిభను గుర్తించిన నిర్వాహకులు ఈ పురస్కారాన్ని ప్రకటించారు. ఈ అవార్డును ఆర్గనైజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్, ప్రముఖ యాంకర్ సమీర్ చేతుల మీదుగా ఆమె స్వీకరించారు. ఈ విజయానికి గాను మంజులను గ్రామ ప్రజలతో పాటు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# బోర్‌వెల్ ప్రారంభించిన తహరాపూర్ గ్రామస్తులు

**వేద న్యూస్, శాయంపేట:**



భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణ రావు సహకారంతో శాయం పేట మండలంలోని తహ రాపూర్ గ్రామ వడ్డెర కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యకు పరి ష్కారం లభించింది. గ్రామంలో నీటి సమస్య ఉందని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన చొరవతో వెంటనే బోర్‌వెల్ తవ్వించి మంగళ వారం గ్రామస్తులు బోర్‌వెల్‌ను ప్రారంభించారు. నీటి సమస్య తీరడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రావుల శ్రీనివాస్, కుక్కల తిరుపతి, నిమ్మల రమేష్, తక్కల్ల సాంబయ్య, చందనల సునీల్, బడుగు అశోక్, విష్ణు, మల్లికార్జున్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**వేద న్యూస్, ఇల్లందకుంట:**



తమ బాల్యస్నేహితుడి కుటుంబానికి మంగళవారం రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఇల్లందకుంట మండల పరిధిలోని బూజునూరు గ్రామానికి చెందిన పింగళి రాజిరెడ్డి మృతి చెందారు. పింగళి రాజిరెడ్డి సతీమణి విజయ కి స్నేహితులతో కలిసి కటంగూరి రాజారెడ్డి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో రాజారెడ్డి సన్నిహితుడు మావురపు గణపతి రెడ్డి, మావురపు రాజిరెడ్డి, కటంగూరి రాజమహెందర్ రెడ్డి, కటంగూరి రాజారెడ్డి వీరాభిమాని ఎడ్ల కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..స్నేహితులకు ఇబ్బందులు వచ్చిన సమయంలో చిన్న నాటి స్నేహితులు తమవంతుగా అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు

# లబ్ధిదారులకు 'డబుల్ ఇండ్ల' మంజూరు పత్రాల పంపిణీ

**వేద న్యూస్, చొప్పదండి:**



చొప్పదండి పట్టణ కేంద్రంలోని వరలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో చొప్పదండి పట్టణానికి చెందిన 168 మంది అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నిజనాపురం చందు, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటి రెడ్డి పద్మాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గుర్రం నీరజ, భూమి ఆత్మ చైర్మన్ గుర్రం రాజేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమండ్ల గంగయ్య, కొట్టే అశోక్, నాయకులు కృష్ణహరి, మునిగాల చందు, ఇతర నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# మోటార్ల దొంగలపై కఠిన చర్యలు తీసుకోవాలి

## – పోలీసులకు కిసాన్ మోర్చా నేత విజ్ఞప్తి

**వేద న్యూస్, చొప్పదండి/రామడుగు:**



దేశానికి పట్టెడన్నం పెట్టే రైతుల వ్యవసాయ మోటార్లను దొంగిలించిన వారిపై ఉక్కుపాదం మోపాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణా రెడ్డి పోలీసులను కోరారు. మండలంలోని గాయత్రి పంప్ హౌస్ గ్రావిటీ కాల్వ వద్ద పంట చేలల్లో పెట్టిన విద్యుత్ మోటార్లను సోమవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ సమాచారం తెలుసుకున్న ఆయన తీవ్రంగా స్పందించారు. మంగళవారం సంఘటన జరిగిన ప్రాంతాన్ని సందర్శించి బాధిత రైతులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లా ధర్మారం, మల్లాపూర్ నుంచి జగిత్యాల వరకు ముఠాలు సంచరిస్తున్నాయని ఆరోపించారు. గతంలో చొప్పదండి సర్కిల్ పరిధిలో ఒకే నెలలో 27 మోటార్లు చోరీకి గురయ్యాయని తెలిపారు. పోలీసులు పెద్ద కుర్మపల్లి వద్ద కొందరిని పట్టుకున్నప్పటికీ, మోటార్లు పూర్తిగా రికవరీ కాలేదన్నారు. మోటార్లు దొంగిలించిన వారిని కేవలం చిల్లర దొంగలుగా పరిగణించకుండా, అవి అమ్మిన వారు, కొనుగోలు చేసిన వారిని గుర్తించి హిస్టరీషీట్లు తెరవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

# పూలే విగ్రహ ఏర్పాటుకు సన్నాహాలు

**వేద న్యూస్, మేడ్చల్ :**



మేడ్చల్ జిల్లా పోచారం సెంటర్ లో పూలే విగ్రహ స్థాపన కోసం బహుజన నేతలు కదిలారు. డా.చింతం ప్రవీణ్ కుమార్ 50 పూలే విగ్రహాల స్థాపన సంకల్ప దీక్షలో భాగంగా ఆయన పోచారం బహుజన నేతలకు పూలే విగ్రహాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డా.చింతం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఇక అన్ని పోరాటాలు అయిపోయాయి మిగిలింది బీసీ రాజ్యాధికార పోరాటమేనన్నారు. మన మహనీయుల గురించి మనం తెలుసుకోకపోతే భవిష్యత్ తరాలు మరింత అంధకారంలోకి వెళ్తాయన్నారు. ఈ దేశ అత్యధికుల మహాత్ముడు మహాత్మ జ్యోతిభా పూలే విగ్రహ ప్రతిష్ఠ వలన ఆయన ఆశయాలు భవిష్యత్ తరాలకు తెలిసే అవకాశం ఉందన్నారు. స్వేచ్ఛా సమానత్వం సౌభ్రాతృత్వం విద్యా అనే నాలుగు అంశాలపైన తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు పూలే అని పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శేఖర్ ముదిరాజ్ , అన్నోజీ గూడ గౌడ సంఘం అధ్యక్షులు భాస్కర్ గౌడ్ ,ప్రముఖ విద్యావేత్త చింతం.గిరి వర్మ భరాస యువనాయకులు శేఖర్ పూర్వ విద్యార్థి నాయకులు శ్రీకాంత్ గౌడ్ , బస్తి ప్రముఖ విక్రమ్ గౌడ్ పోచారం డివిజన్ అధ్యక్షులు సురేష్ నాయక్ గారు మాజీ వైస్ చైర్మన్ రెడ్యానాయక్ ఉపాధ్యక్షులు వరికుప్పల గిరి ప్రధాన కార్యదర్శులు కోన మల్లేష్,రేతి వెంకటేష్ కార్యదర్శి రవిశంకర్ వంశీ కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.త్వరలో పూలే విగ్రహ ఏర్పాట్లకు సంబంధించి కమిటీ ప్రకటన పునాది ఏర్పాటు ఉంటుందని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు.

# ఎన్నికల విధులపై పూర్తి అవగాహన ఉండాలి

## – నోడల్ అధికారులకు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాలు

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



మున్సిపల్ ఎన్నికల నోడల్ అధికారులు తమ విధులపై పూర్తి అవగాహన కలిగి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణలో మానవ వనరులు, శిక్షణ, రవాణా, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఖర్చు పర్యవేక్షణ, పోస్టల్ బ్యాలెట్, ఎలక్టోరల్ రోల్స్ అంశాలపై నియమిత నోడల్ అధికారులు సర్వసన్నద్ధంగా ఉండాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను సమగ్రంగా అధ్యయనం చేసి, ఫిర్యాదులకు వేగంగా పరిష్కారం చూపాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి కఠినంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# మహమ్మద్ అబ్దుల్ సబిల్‌కు ప్రశంస పత్రం



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండలం రాయకూర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్‌మ్యాన్‌గా పనిచేస్తున్న మహమ్మద్ అబ్దుల్ సబిల్‌కు ఉత్తమ లైన్‌మ్యాన్‌గా ఎంపికైన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రశంస పత్రాన్ని అందజేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ ప్రశంస పత్రాన్ని ఆయన స్వీకరించారు. రాయకూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రజలకు ఉత్తమ విద్యుత్ సేవలు అందించినందుకు ఆయనకు ఈ గౌరవం దక్కింది. మహమ్మద్ అబ్దుల్ సబిల్ 2007లో విద్యుత్ శాఖలో చేరి, 2017 నుంచి 2021 వరకు రాయకూర్ సబ్‌స్టేషన్‌లో సేవలందించారు. అనంతరం బదిలీపై బోధన్‌కు వెళ్లి, తిరిగి 2024 నుంచి మళ్లీ రాయకూర్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ఉత్తమ లైన్‌మ్యాన్‌గా ఎంపికైన మహమ్మద్ అబ్దుల్ సబిల్‌ను విద్యుత్ శాఖ అధికారులు ఎస్ఈ రాజేశ్వర్, డీఈ ముక్తార్, ఏడీఈ నవీన్, ఏఈ శ్రీనివాస్, సబ్ ఇంజనీర్ గిరిధర్, అలాగే సహ ఉద్యోగులు శ్రీనివాస్ దేశాయ్, కరీం, ఆనంద్ తదితరులు అభినందనలు తెలిపారు.

# ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

## – కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**

జిల్లాలో జరగనున్న మునిసిపల్ ఎన్నికలను స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని విభాగాల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ రాష్ట్రవ్యాప్తంగా 7 మునిసిపల్ కార్పొరేషన్లు, 116 మునిసిపాలిటీల్లో ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో, ఖమ్మం జిల్లాలోని ఐదు మునిసిపాలిటీల్లో ఎన్నికలు జరగనున్నాయని కలెక్టర్ వెల్లడించారు. ఈ ఎన్నికలు ఏదులాపురం, వైరా, మధిర, కల్లూరు, సత్తుపల్లి మునిసిపాలిటీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎలక్టోరల్ రోల్‌కు సంబంధించి వచ్చిన 417 అభ్యంతరాలను పూర్తిగా పరిష్కరించినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఈ ఐదు మునిసిపాలిటీల్లో మొత్తం 117 వార్డులు ఉండగా, 242 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఓటర్ల సంఖ్య విషయానికొస్తే సత్తుపల్లి మునిసిపాలిటీలో 28,830 మంది, మధిరలో 25,679 మంది, వైరాలో 24,689 మంది, ఏదులాపురంలో 45,256 మంది, కల్లూరులో 18,866 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు 55 మంది రిటర్నింగ్ అధికారులు, 55 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, 291 మంది ప్రిసైడింగ్ అధికారులు, 948 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 26 మంది జోనల్ అధికారులు నియమించామని తెలిపారు. అదనంగా 10 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 10 స్టాటిక్ సర్వైలెన్స్ టీములు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎన్నికల వ్యయంపై నిఘా కోసం 5 మంది వ్యయ పరిశీలకులు, రెండు సభ్యుల అకౌంటింగ్ టీములను నియమించినట్లు చెప్పారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు ఏదులాపురంలో 13, కల్లూరులో 7, మధిరలో 8, సత్తుపల్లిలో 8, వైరాలో 7 మొత్తం 43 నామినేషన్ స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. నామినేషన్, పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం ఏదులాపురానికి 166, కల్లూరుకు 96, సత్తుపల్లికి 113, మధిరకు 106, వైరాకు 99 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసినట్లు చెప్పారు. మొత్తం 242 పోలింగ్ కేంద్రాల్లో 25 సెన్సిటివ్, 33 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. శాంతి భద్రతల దృష్ట్యా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమలులోకి వస్తుందని పేర్కొంటూ, ఎన్నికలను స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విజ్ఞప్తి చేశారు.

# తహసీల్దార్‌కు ప్రతిభా అవార్డు


**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**



వేములపల్లి తహసీల్దార్ విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు ప్రతిభా అవార్డుకు ఎంపికయ్యారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆమె విశిష్ట సేవా పథకాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇలాంటి అవార్డులు తమ బాధ్యతలను మరింత పెంచుతాయని పేర్కొన్నారు.

# ఎంపీవో గారు మీరెక్కడా..!?

- విధులు మరిచారా?
- వీలు కుదిరినప్పుడే డ్యూటీ నా?
- చర్చనీయాంశంగా సదరు అధికారి తీరు!



**వేద న్యూస్, కమలాపూర్:**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల పంచాయతీ అధికారి తన విధుల పట్ల నిర్లక్ష్యం గా వ్యవహరిస్తూ.. ప్రజలకు సేవలందించకుండా తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఆయన మండల పరిషత్ కార్యాలయానికి ఎప్పుడు వస్తున్నారో? ఎప్పుడు వెళ్తున్నారో..? అసలు వచ్చి ఏం చేస్తున్నారో? ప్రజలు ఎవరికీ అర్థం కాని పరిస్థితి నెలకొంది. వీలు కుదిరినప్పుడు డ్యూటీకి వెళ్ళామా? అది కూడా నచ్చిన సమయానికి నచ్చిన వేళలో, సమయానికి జీతం తీసుకున్నామా? అన్న చందంగా వ్యవహరిస్తున్న అధికారి తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. సదరు ఆఫీసర్ వారి బాధ్యతలను నిర్వహించడంలో విఫలమయ్యారనే టాక్ వినబడుతోంది. ఉన్నతాధికారులు ఈ విషయమై దృష్టి సారించాలని, మండల స్థాయి అధికారులు చక్కగా విధులు నిర్వర్తించేలా చూడాలని మండల వాసులు కోరుతున్నారు.

# జమదగ్ని-పరశురాముని విగ్రహాలకు వెండి మీసాలు, కళ్లు అందజేత

**వేద న్యూస్, టేక్మాల్:**



మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మట్ పల్లి గ్రామంలో గుట్టపై వెలిసిన రేణుకామాత ఆలయంలో ఉన్న జమదగ్ని-పరశురాముని విగ్రహాలకు వెండితో తయారు చేసిన మీసాలు, కళ్లను కంకర సంగయ్య ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులు కంకర సంగయ్యను శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గ్రామ పెద్దలు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు కలాలి సంతోష్ గౌడ్, ఉపాధ్యక్షుడు చిన్న నాగరాజ్ గౌడ్, గ్రామ పెద్దలు ఘటంగారి ఈశ్వరప్ప, గౌడ కుల పెద్దలు విట్టల్ గౌడ్, ధనుంజయ గౌడ్, భూపాల్ గౌడ్, పెద్ద రాజు గౌడ్, ప్రతాప్ గౌడ్, రాజేశ్వర్ గౌడ్, వినీత్ గౌడ్, కంకర మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్



# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**- జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు**



**వేద న్యూస్, మెదక్:**

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ జిల్లా న్యాయస్థానం తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు తెలిపారు. బీహార్‌కు చెందిన సర్వన్ కుమార్‌ను 2024 ఏప్రిల్ 20న మనోహరాబాద్ పరిధిలో వీవీఎం ఆగ్రో కంపెనీ సమీపంలో బండరాయితో కొట్టి హత్య చేసిన కేసులో నిందితుడు ఓం ప్రకాష్ రాయ్‌ను దోషిగా నిర్ధారించారు. మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, అప్పటి దర్యాప్తు అధికారి కృష్ణ సమగ్ర విచారణ చేపట్టి కీలక సాక్ష్యాధారాలు సేకరించారు. సాక్ష్యాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితుడికి జీవిత ఖైదు శిక్ష విధించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ వాదనలు వినిపించగా, కేసు విచారణలో సహకరించిన పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# హత్యాయత్నం కేసులో నిందితునికి మూడేళ్ల జైలు

**వేద న్యూస్, మందమర్రి :**

మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో 2018న జరిగిన హత్యయత్నం కేసులో నేరం రుజువుకావడంతో నిందితుడికి కోర్టు మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించింది. డబ్బుల లావాదేవీల విషయంలో జరిగిన గొడవలో మందమర్రి పెట్రోల్ బంక్ సమీపంలో కోహినూరు దక్షిణామూర్తి, వరిగేష్‌ను చంపాలనే ఉద్దేశంతో కత్తితో దాడి చేయగా బాధితుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటనపై అప్పటి ఎస్ఐ పి. సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టులో విచారణ జరిపిన అనంతరం నేరం రుజువుకావడంతో మంచిర్యాల సీనియర్ సివిల్ జడ్జి ఏ. నిర్మల శిక్ష విధించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంది రవీందర్ కీలకంగా వాదనలు వినిపించగా, మందమర్రి సీఐ పి. రమేష్, ఎస్ఐ జి. నరేష్,



కోర్ట్ కానిస్టేబుల్ ఇ. సురేందర్ తదితరులు కేసు విచారణలో సమర్థవంతంగా సహకరించారు. ప్రాసిక్యూషన్ బృందాన్ని రామగుండం డీఐజీ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

# బాలసదన్ చిన్నారులకు స్కూల్ బ్యాగ్‌ల పంపిణీ

**వేద న్యూస్, మెదక్:**

యూత్ ఫర్ సేవ సంస్థ సహకారంతో మంగళవారం ఉదయం బాలసదన్‌లోని విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు ఆదేశాల మేరకు ఆర్ఐ శైలందర్ బాలసదన్‌ను సందర్శించి అక్కడ ఉన్న విద్యార్థులకు మొత్తం 25 స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ శైలందర్ మాట్లాడుతూ, విద్యే జీవితంలో అత్యంత విలువైన సంపదని, కష్టపడి చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని పిల్లలకు సూచించారు. ప్రతి ఒక్కరూ లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని, చదువుతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, మంచి అలవాట్లు అలవర్చుకోవడం కూడా ఎంతో అవసరమని తెలిపారు. పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంచేలా ప్రోత్సాహక మాటలు చెప్పి, వారు సమాజానికి ఆదర్శ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సీసీ రాజేందర్, నిర్వాహకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రక్రియ

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ - నామినేషన్ స్వీకరణ కేంద్రం పరిశీలన**

**వేద న్యూస్, మంచిర్యాల:**

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల కార్యచరణను విడుదల చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ జి. అన్వేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియలు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. మంచిర్యాల కార్పొరేషన్‌కు నస్పూర్‌లో, లక్షెట్టిపేటకు పాత మండల పరిషత్ కార్యాలయంలో, క్యాతనపల్లి, బెల్లంపల్లి, చెన్నూర్ మున్సిపాలిటీలకు ఆయా మున్సిపల్ కార్యాలయాల్లో నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమాచారం, ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్ నంబర్ 08736-205051 ఏర్పాటు చేసినట్లు, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని కలెక్టర్ తెలిపారు.



# మేయర్ చేతుల మీదుగా ఎంబీబీఎస్ విద్యార్థులకు ఆర్థిక సహాయం



- ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన విద్యార్థులకు చెక్కుల పంపిణీ
- వైద్య విద్యకు సంపూర్ణ సహకారం అందిస్తాం: ఎమ్మెల్యే
- పేద, మధ్యతరగతి విద్యార్థులకు పెద్ద ఊతం
- విద్యే సమాజాభివృద్ధికి పునాది

**వేద న్యూస్ హైదరాబాద్ :**

హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి చేతుల మీదుగా ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులకు ఐదు లక్షల రూపాయల విలువైన చెక్కులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పంపిణీ చేశారు. వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఆర్థిక భారం తగ్గించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, విద్య అనేది సమాజాభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. ముఖ్యంగా వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు భవిష్యత్తులో సమాజానికి కీలక సేవలు అందిస్తారని, అందుకే వారికి అన్ని విధాలా సహకారం అందించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. ఆర్థిక ఇబ్బందులు చదువుకు అడ్డంకి కాకూడదన్న లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. మేయర్ గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు ఆర్థిక సమస్యల కారణంగా చదువు మానేయకుండా ఇలాంటి సహాయ కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమని ప్రశంసించారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి వైద్యులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు, మహేష్ గౌడ్, రాజు కుమార్, సీతారాము కాలనీ అధ్యక్షుడు రమేశ్‌తో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులకు అందిన ఈ సహాయం వారి విద్యా ప్రయాణానికి బలమైన తోడ్పాటుగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు.

# జీహెచ్ఎంసీ మెగా స్పెషల్ పారిశుధ్య డ్రైవ్ కొనసాగుతోంది

**వేద న్యూస్ హైదరాబాద్ :**

నగరాన్ని మరింత పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన మెగా స్పెషల్ పారిశుధ్య డ్రైవ్ 29వ రోజుకూ కొనసాగుతోంది. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ, విభాగాల మధ్య సమన్వయంతో నగరవ్యాప్తంగా పారిశుధ్య చర్యలు వేగంగా అమలవుతున్నాయి. ఈ డ్రైవ్‌లో భాగంగా అంబర్‌పేట, కవాడిగూడతో పాటు జీహెచ్ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. స్థానిక నివాసితులతో నేరుగా మాట్లాడి పారిశుధ్యానికి సంబంధించిన అవసరాలు, సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టారు. ప్రజల భాగస్వామ్యంతో పరిసరాల్లో స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయని అధికారులు తెలిపారు. ప్రజా మరుగుదొడ్ల సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించారు. భద్రత లేని, వినియోగంలో లేని నిర్మాణాలను తొలగిస్తూ, పరిశుభ్రత ప్రమాణాలు పెంచే చర్యలు చేపట్టారు. మరుగుదొడ్ల చుట్టుపక్కల శుభ్రత, మొక్కల నాటకం వంటి కార్యక్రమాలు నిర్వహించి పరిసరాలను ఆహ్లాదకరంగా మార్చారు. నిరంతర పర్యవేక్షణ, ప్రజల సహకారంతో నగరమంతా శుభ్రత, ప్రజా ఆరోగ్యం బలోపేతం చేయడమే లక్ష్యమని జీహెచ్ఎంసీ అధికారులు స్పష్టం చేశారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, నివసించదగిన హైదరాబాద్ కోసం ఈ మెగా పారిశుధ్య డ్రైవ్ కొనసాగుతుందని తెలిపారు.





## చరిత్ర హెచ్చరిక
# హోలోకాస్ట్ మనకు చెప్పే మానవత్వ పాఠం

**- ద్వేషం పుట్టించిన విధ్వంసం - మానవ హక్కుల విలువ**
**- మౌనం చేసిన నేరం - భవిష్యత్తుకు బాధ్యత**

**వేద న్యూస్ డెస్క్:**

ప్రపంచ చరిత్రలో మానవత్వం తలదించుకునే అత్యంత విషాద ఘట్టాల్లో హోలోకాస్ట్ ఒకటి. కోట్లాది మంది నిర్దోషులు కేవలం వారి మతం, జాతి, ఆలోచనల కారణంగా హింసకు గురై ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటన ఇది. హోలోకాస్ట్‌ను ఒక చరిత్ర సంఘటనగా మాత్రమే చూడడం అత్యంత ప్రమాదకరం. అది మనుషుల మనస్తత్వం ఎలా ద్వేషంతో విషపూరితమవుతుందో, అధికారానికి మానవత్వం తోడుకాకపోతే సమాజం ఎంతటి విధ్వంసానికి దారి తీస్తుందో చూపిన ఘోర హెచ్చరిక.

ద్వేషం అనేది ఒక్కసారిగా పుట్టదు. అది మాటల రూపంలో మొదలై, ఆలోచనలుగా మారి, చివరికి చట్టాలుగా, చర్యలుగా రూపాంతరం చెందుతుంది. హోలోకాస్ట్‌కు ముందు కూడా వివక్ష చిన్నచిన్న నిర్ణయాలుగా మొదలైంది. ఒక వర్గాన్ని తక్కువగా చూడడం, మరో వర్గాన్ని శత్రువులుగా చిత్రీకరించడం, ప్రజలను భయంతో జీవించేటట్లు చేయడం ఇవన్నీ కలిసి మానవ వినాశనానికి బాట వేసాయి. ఈ ప్రక్రియలో భయపడిన సమాజం మౌనంగా ఉండిపోయింది. అదే మౌనం కోట్లాది ప్రాణాలకు శిక్షగా మారింది.

హోలోకాస్ట్ మనకు మానవ హక్కుల విలువను గట్టిగా గుర్తుచేస్తుంది. జీవించే హక్కు, గౌరవంతో బతికే హక్కు, అభిప్రాయం చెప్పే హక్కు ఇవన్నీ ఎవరి దయాధర్మాలు కావు. కానీ ఒక సమాజం ఈ హక్కులను కాపాడడంలో విఫలమైతే, ప్రజాస్వామ్యం పేరుకే మిగిలిపోతుంది. హోలోకాస్ట్ తర్వాతే ప్రపంచం మానవ హక్కుల గురించి గట్టిగా మాట్లాడటం ప్రారంభించింది. కానీ చరిత్ర చూపించిన సత్యం ఒక్కటే హక్కులు మాటల్లో కాదు, ఆచరణలో ఉండాలి.

ఈ ఘోర ఘటనలో అత్యంత బాధాకరం మౌనం. అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోవడం కూడా ఒక నేరమేనని హోలోకాస్ట్ చెబుతుంది. అప్పటి కాలంలో చాలామంది “ఇది మన సమస్య కాదు” అని అనుకున్నారు. కానీ చివరికి ఆ మంట అందరినీ తాకింది. ఈరోజు కూడా సమాజంలో వివక్ష, ద్వేషం, హింస కనిపించినప్పుడు మౌనం వహిస్తే, చరిత్ర మళ్లీ అదే దారిలో నడుస్తుంది. అందుకే ప్రశ్నించడం, ఎదురు నిలవడం ప్రతి పౌరుడి బాధ్యత.

భవిష్యత్తును కాపాడాలంటే గతాన్ని మర్చిపోవద్దు. హోలోకాస్ట్ స్మరణ దినం కేవలం పుష్పాంజలి కాదు; అది ఒక ప్రతిజ్ఞ. మతం, కులం, భాష, ఆలోచనల ఆధారంగా ఎవరినీ శత్రువులుగా మార్చకూడదన్న ప్రతిజ్ఞ. ద్వేష రాజకీయాలకు తావివ్వకూడదన్న సంకల్పం. విద్య, చర్చ, అవగాహన ద్వారానే సమాజాన్ని రక్షించగలమన్న నమ్మకం.

చరిత్ర పునరావృతం కావాలంటే దానికి కారణం మనమే. హోలోకాస్ట్ మనకు ఇచ్చిన అత్యంత పెద్ద పాఠం ఇదే మానవత్వాన్ని కాపాడటం ఒక ఎంపిక కాదు, అది బాధ్యత. ఈ బాధ్యతను ప్రతి తరం మోసుకోవాల్సిందే. అప్పుడే హోలోకాస్ట్ స్మరణకు నిజమైన అర్థం ఉంటుంది. ఈరోజు ప్రపంచాన్ని చూస్తే, హోలోకాస్ట్ పాఠాలు ఇంకా పూర్తిగా నేర్చుకోలేదన్న భావన కలుగుతుంది. మతం, జాతి, భాష, ఆలోచనల పేరుతో విభజనలు పెరుగుతున్నాయి. ద్వేష ప్రసంగాలు సాధారణంగా మారుతున్నాయి. తప్పుడు సమాచారంతో ప్రజలను రెచ్చగొడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో హోలోకాస్ట్ స్మరణ దినం మరింత ప్రాసంగికంగా మారుతుంది. ఇది కేవలం గతాన్ని గుర్తుచేసే రోజు కాదు; వర్తమానాన్ని ప్రశ్నించే రోజు.

భవిష్యత్తును సురక్షితంగా ఉంచాలంటే చరిత్రను మర్చిపోవద్దు. హోలోకాస్ట్ స్మరణ అనేది ఒక ఆచారం కాదు, అది ఒక ప్రతిజ్ఞ. “ఇలాంటి దుర్ఘటనలు మళ్లీ జరగకూడదు” అన్న సంకల్పం. సమాజంలో ద్వేషం కనిపించినప్పుడు ఎదురు నిలవాలన్న ధైర్యం. బలహీనుల పక్షాన నిలబడాలన్న బాధ్యత. ఈ బాధ్యత ప్రభుత్వాలకే కాదు, ప్రతి పౌరుడికీ ఉంది.

విద్య, అవగాహన, చర్చ ఇవే హోలోకాస్ట్ లాంటి విషాదాలు మళ్లీ జరగకుండా అడ్డుకునే మార్గాలు. పిల్లలకు చరిత్రను కేవలం తేదీలు, సంఘటనలుగా కాకుండా, మానవ విలువల కోణంలో బోధించాలి. అప్పుడే వారు ద్వేషాన్ని గుర్తించి తిరస్కరించే శక్తిని పెంపొందించుకుంటారు. ఒక తరం నేర్చుకోకపోతే, మరో తరం అదే తప్పును తిరిగి చేస్తుంది.

హోలోకాస్ట్ మనకు ఇచ్చిన అత్యంత పెద్ద పాఠం ఇదే మానవత్వం సహజంగా నిలబడదు, దాన్ని కాపాడుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే అది క్షణాల్లోనే కూలిపోతుంది. కాబట్టి ఈ స్మరణ దినం మనందరినీ ఒక ప్రశ్న అడుగుతుంది మనం మౌనంగా నిలబడతామా, లేక మానవత్వం కోసం నిలబడతామా? ఈ ప్రశ్నకు ఇచ్చే సమాధానమే రేపటి ప్రపంచాన్ని నిర్ణయిస్తుంది.హోలోకాస్ట్ మనకు మానవ హక్కుల విలువను గట్టిగా గుర్తుచేస్తుంది. జీవించే హక్కు, గౌరవంతో బతికే హక్కు, అభిప్రాయం చెప్పే హక్కు ఇవన్నీ ఎవరి దయాధర్మాలు కావు. కానీ ఒక సమాజం ఈ హక్కులను కాపాడడంలో విఫలమైతే, ప్రజాస్వామ్యం పేరుకే మిగిలిపోతుంది. హోలోకాస్ట్ తర్వాతే ప్రపంచం మానవ హక్కుల గురించి గట్టిగా మాట్లాడటం ప్రారంభించింది. కానీ చరిత్ర చూపించిన సత్యం ఒక్కటే హక్కులు మాటల్లో కాదు, ఆచరణలో ఉండాలి.

ఈ ఘోర ఘటనలో అత్యంత బాధాకరం మౌనం. అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోవడం కూడా ఒక నేరమేనని హోలోకాస్ట్ చెబుతుంది. అప్పటి కాలంలో చాలామంది “ఇది మన సమస్య కాదు” అని అనుకున్నారు. కానీ చివరికి ఆ మంట అందరినీ తాకింది. ఈరోజు కూడా సమాజంలో వివక్ష, ద్వేషం, హింస కనిపించినప్పుడు మౌనం వహిస్తే, చరిత్ర మళ్లీ అదే దారిలో నడుస్తుంది. అందుకే ప్రశ్నించడం, ఎదురు నిలవడం ప్రతి పౌరుడి బాధ్యత.

భవిష్యత్తును కాపాడాలంటే గతాన్ని మర్చిపోవద్దు. హోలోకాస్ట్ స్మరణ దినం కేవలం పుష్పాంజలి కాదు; అది ఒక ప్రతిజ్ఞ. మతం, కులం, భాష, ఆలోచనల ఆధారంగా ఎవరినీ శత్రువులుగా మార్చకూడదన్న ప్రతిజ్ఞ. ద్వేష రాజకీయాలకు తావివ్వకూడదన్న సంకల్పం. విద్య, చర్చ, అవగాహన ద్వారానే సమాజాన్ని రక్షించగలమన్న నమ్మకం.

చరిత్ర పునరావృతం కావాలంటే దానికి కారణం మనమే. హోలోకాస్ట్ మనకు ఇచ్చిన అత్యంత పెద్ద పాఠం ఇదే మానవత్వాన్ని కాపాడటం ఒక ఎంపిక కాదు, అది బాధ్యత. ఈ బాధ్యతను ప్రతి తరం మోసుకోవాల్సిందే. అప్పుడే హోలోకాస్ట్ స్మరణకు నిజమైన అర్థం ఉంటుంది. ఈరోజు ప్రపంచాన్ని చూస్తే, హోలోకాస్ట్ పాఠాలు ఇంకా పూర్తిగా నేర్చుకోలేదన్న భావన కలుగుతుంది. మతం, జాతి, భాష, ఆలోచనల పేరుతో విభజనలు పెరుగుతున్నాయి. ద్వేష ప్రసంగాలు సాధారణంగా మారుతున్నాయి. తప్పుడు సమాచారంతో ప్రజలను రెచ్చగొడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో హోలోకాస్ట్ స్మరణ దినం మరింత ప్రాసంగికంగా మారుతుంది. ఇది కేవలం గతాన్ని గుర్తుచేసే రోజు కాదు; వర్తమానాన్ని ప్రశ్నించే రోజు.భవిష్యత్తును సురక్షితంగా ఉంచాలంటే చరిత్రను మర్చిపోవద్దు. హోలోకాస్ట్ స్మరణ అనేది ఒక ఆచారం కాదు, అది ఒక ప్రతిజ్ఞ. “ఇలాంటి దుర్ఘటనలు మళ్లీ జరగకూడదు” అన్న సంకల్పం. సమాజంలో ద్వేషం కనిపించినప్పుడు ఎదురు నిలవాలన్న ధైర్యం. బలహీనుల పక్షాన నిలబడాలన్న బాధ్యత. ఈ బాధ్యత ప్రభుత్వాలకే కాదు, ప్రతి పౌరుడికీ ఉంది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073